# 2036 ఒలంపిక్ క్రీడల నిర్వహణకు భారత్ వేదిక కానున్నదా?!

"దృఢమైన శరీరంలోనే బలమైన మెదడు ఉంటుంది (స్ట్రాంగ్ మైండ్ ఇన్ స్ట్రాంగ్ బాడీ)" అనేది క్రీడా నినాదం. దేహ దృఢత్వానికి పునాది క్రీడలు. ప్రపంచ క్రీడా పోటీల్లో సర్వోత్తమమైనవి ఒలంపిక్ క్రీడలు. 1896లో గ్రీస్‌లో ప్రారంభమైన ఒలంపిక్ క్రీడలు నాలుగేళ్లకు ఒకసారి నిర్వహిస్తూ చివరగా 2020లో జపాన్‌లో నిర్వహించబడ్డాయి. సమీప భవిష్యత్తులో 2024లో ఫ్రాన్స్, 2028లో యూఎస్, 2032లో ఆస్ట్రేలియా నిర్వహించడానికి ఇంటర్నేషనల్ ఒలంపిక్ కమిటీ, ఐఓసి నుంచి అనుమతులు పొంది భారీ ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. వీటితో పాటు 1924 నుంచి 'వింటర్ ఒలంపిక్స్' కూడా నిర్వహిస్తున్నారు. ఇటీవల 91 దేశాలకు చెందిన 2,871 మంది క్రీడాకారులు పాల్గొన్న 2022 క్రీడల్ని చైనా నిర్వహించింది. 2026 వింటర్ ఒలంపిక్ క్రీడల్ని ఇటలీ నిర్వహించనున్నది. ప్రపంచవ్యాప్తంగా 206 దేశాల జాతీయ ఒలంపిక్ కమిటీలను ఐఓసి (అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ) గుర్తించింది.

### ఒలంపిక్ క్రీడల నిర్వహణకు మన అర్హతలు ఏమిటి !

వేగంగా అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందుతున్న భారతదేశం, ప్రపంచ దేశాల ముందు, ముఖ్యంగా ఆసియా దేశాల్లో ప్రముఖ దేశంగా సగర్వంగా నిలబడుతున్న వేళ ఒలంపిక్ క్రీడలకు వేదిక కావాలనుకోవడం ముదావహం. ఒలంపిక్స్ నిర్వహించడం ఓ అద్భుత అవకాశం. ప్రపంచ ప్రఖ్యాతిగల ఒలంపిక్స్ నిర్వహిస్తున్న దేశం వైపు 16 రోజుల పాటు విశ్వ మానవాళి దృష్టి ఆకర్షితమవుతుంది. 2036లో ఒలంపిక్ క్రీడలను భారత్ నిర్వహించడానికి సిద్ధంగా ఉందని మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించడం దేశ వాసుల సంతోషానికి మరింత కారణమయ్యింది. ఒలంపిక్స్ నిర్వహణ ఓ సవాళ్లతో కూడుకున్న అంశం. విశ్వ క్రీడాపోటీల నిర్వహణ ద్వారా మంచి పేరు రావచ్చు లేదా ఆబాసుపాలు కూడా కావచ్చని గత పలు అనుభవాలు చాటుతున్నాయి. ఒలంపిక్స్‌ను సమర్థవంతంగా నిర్వహించుట ద్వారా ప్రపంచ ప్రజలు, క్రీడాకారులు, క్రీడాభిమానుల దృష్టిని ఆతిథ్య దేశం ఆకట్టుకుంటుంది.

### అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ, జాతీయ ఒలంపిక్ కమిటీల పాత్ర :

ఒలంపిక్ క్రీడల నిర్వహణ భాద్యత "అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ (ఇంటర్నేషనల్ ఒలంపిక్ కమిటీ, ఐఓసి)"తో పాటు "జాతీయ ఒలంపిక్ కమిటీ (నేషనల్ ఒలంపిక్ కమిటీ, ఎన్ఓసి)"ల పైన మాత్రమే ఉంటుంది. ఈ క్రీడల నిర్వహణలో ప్రభుత్వ విభాగాల ప్రమేయం కూడా మరువలేనిది. ప్రభుత్వ సహకారంతో ఎన్ఓసి అభ్యర్థన అనంతరం ఏ దేశంలో నిర్వహించాలనే నిర్ణయాన్ని ఐఓసి తీసుకుంటుంది. ఐఓసి నిర్ణయం ద్వారా ఎన్ఓసి సంస్థకు ఒలంపిక్ క్రీడలు నిర్వహించడానికి బాధ్యత ఇవ్వబడుతుంది. ఒలంపిక్స్ నిర్వహణకు అవసరమయ్యే భారీ మౌళిక వనరుల కల్పన, క్రీడాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, సామాజిక సౌకర్యాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పూర్తి సమన్వయ సహకారాలు మరింతగా అవసరమవుతాయి. ఒలంపిక్స్‌లో పతకాల గెలుపుతో పాటు సమర్థవంతమైన విశ్వ క్రీడల నిర్వహణ అనుభవాలు, పలు విభాగాల సమన్వయ సామర్థ్యాలు కూడా కావలసి వస్తుంది.

### ఒలంపిక్స్ నిర్వహణకు మనం సిద్ధంగా ఉన్నామా !

ఒలంపిక్స్ నిర్వహించే దేశాల సంస్కృతి, వారసత్వం, మౌళిక వసతులు, ఆర్థిక పరిపుష్టి, ప్రభుత్వ పట్టుదల, ఆతిథ్య నిర్వహణ సామర్థ్యాలు, క్రీడా వ్యవస్థలు, క్రీడా సంఘాలు, ప్రజా భాగస్వామ్యం మొదలగు అంశాలు దోహదపడతాయి. 2010లో కామన్‌వెల్త్ గేమ్స్‌తో పాటు 1951, 1982ల్లో ఆసియా క్రీడలను భారత్ నిర్వహించి పలు సవాళ్ళను ఎదుర్కొన్న విషయం మనకు తెలుసు. 2036లో ఒలంపిక్ క్రీడల్ని భారత్ నిర్వహించాలంటే నేటి నుంచి రానున్న 13 సంవత్సరాల వరకు ఏర్పాట్లలో నిమగ్నం కావలసి ఉంటుందని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఒలంపిక్స్ నిర్వహణకు అనువైన క్రీడా పోటీలకు వేదిక కానున్న పట్టణాన్ని ఎంపిక చేసుకోవడం తక్షణ కర్తవ్యమని గమనించాలి. ఈ క్రీడల నిర్వహణకు ప్రత్యేక క్రీడా గ్రామాన్ని (ఒలంపిక్ విలేజ్) నిర్మించాల్సి ఉంటుంది. రానున్న 13 ఏండ్లలో దేశంలోని ఎంపిక చేసిన ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులు, రోడ్లు, బ్రిడ్జిలు, ఇతర సంబంధ వసతుల ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికగా చేయాల్సి ఉంటుంది. ఈ విశ్వ క్రీడల నిర్వహణకు రెండు పట్టణాలు/ప్రాంతాలు, రెండు దేశాలు కూడా నిర్వహించడానికి ఐఓసి వెసులుబాటు కల్పించింది. 2024లో ఒలంపిక్స్ నిర్వహిస్తున్న ప్యారిస్(ఫ్రాన్స్) నగరం వడివడిగా వసతులను, వనరులను కూడగట్టుకుంటూ ముందుకు సాగుతోంది.

### ఒలంపిక్ క్రీడల ఆతిథ్యం, నిర్వహణ అంత సులభమా !

భారత్‌లో క్రీడలకు ప్రాధాన్యం, వసతుల కల్పన, నిధుల కేటాయింపులు, ప్రభుత్వ క్రీడా సంఘాల పాత్ర, క్రీడల పట్ల ఆదరణ, క్రీడాకారుల ఆసక్తి లాంటివి ఇతర దేశాలతో పోల్చితే చాలా తక్కువ. 2036 ఒలంపిక్ క్రీడల నిర్వహణకు భారత్‌తో పాటు బుడాపెస్ట్ కూడా తన సమ్మతిని తెలియపర్చింది. మన దేశంలోని ఢిల్లీ, అహమ్మదాబాదు, చెన్నై లేదా ముంబాయ్ మహానగరాల్లోని వసతులతో పోల్చితే బుడాపెస్ట్ వసతులు కొంత మెరుగ్గా ఉన్నాయని సమాచారం. ఒలంపిక్ క్రీడలు నిర్వహించే అవకాశం పొందితే మన దేశంలోని యువత క్రీడల వైపు ఆకర్షితం కావడం, క్రీడా ప్రాధాన్యం, అత్యున్నత మౌళిక వసతుల అందుబాటు లాంటి సానుకూలతలు కూడా ముడిపడి ఉంటాయి. ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో భారత్ 107 పతకాలు గెలుచుకున్న విషయం మనకు తెలుసు. ఆసియా పతకాల గెలుపుకు, ఒలంపిక్ పతకాల గెలుపుకు అనంత దూరం ఉంటుంది. 2008 ఒలంపిక్స్‌లో 3 పతకాలు, 2012లో 6 పతకాలు, 2021లో 7 పతకాలను భారత క్రీడాకారులు గెలుచుకొని పతకాల పట్టికలో దిగువనే ఉన్నది. మనం జట్లు అధికంగా సైక్లింగ్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్, రోయింగ్, కయాక్–కనోయింగ్ క్రీడల్లో కొంత మెరుగైన సామర్థ్యాలను ప్రదర్శించిందని, ఇతర క్రీడల్లో విదేశీ పోటీదారుల నైపుణ్యానికి చాలా దూరంగా ఉన్నారని గమనించాలి.

ఒలంపిక్ క్రీడల నిర్వహణతో దేశ ఖ్యాతి మరింత ఇనుమడిస్తుంది. 2036లో ఒలంపిక్స్ నిర్వహించాలంటే నేటి నుంచే ముమ్మరంగా మౌళిక వసతుల కల్పన పనులను ప్రారంభించాలి. ఒలంపిక్స్ నిర్వహణకు కనీసం 20 ఏండ్ల ప్రయాస అవసరం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. 140 కోట్ల భారతావనికి గర్వకారణమయ్యే ఒలంపిక్ క్రీడల వేదికగా భారత్ ఎంపిక కావాలని, సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన మౌళిక వసతులు ఏర్పాటు సకాలంలో చేయాలని, గతంతో పోల్చితే కనీసం 20కి పైగా ఒలంపిక్ పతకాలను భారత్ గెలవాలని కోరుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుల్లో మనీష్ సిసోడియాకు మరోసారి ఎదురుదెబ్బ

న్యూ డిల్లీ అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుల్లో అరెస్టైన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత మనీష్ సిసోడియా కు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో సిసోడియాకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ మేరకు బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్లను ధర్మాసనం కొట్టేసింది.

గతంలో సిసోడియా దాఖలు చేసిన రెండు వేర్వేరు బెయిల్ దరఖాస్తులపై అక్టోబర్ 17న తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం.. తాజాగా తీర్పును వెలువరించింది.

ఈ కేసుకు సంబంధించిన కొన్ని ఆధారాలను ఈడీ తమకు అందించినట్లు కోర్టు తెలిపింది. లిక్కర్ స్కామ్‌లో రూ.338 కోట్ల నగదు బదిలీకి సంబంధించి ఈడీ కొన్ని ఆధారాలను చూపించినట్లు దేశ అత్యున్నత న్యాయస్థానం వెల్లడించింది. ఇక ఈ లిక్కర్ స్కామ్ కేసులో విచారణను పూర్తి చేసేందుకు ఈడీకి సుప్రీంకోర్టు 6 నుంచి 8 నెలల సమయం ఇచ్చింది. విచారణ నెమ్మదిగా సాగితే.. మూడు నెలల్లోపు సిసోడియా మళ్లీ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హత పొందుతారని సుప్రీం పేర్కొంది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణంతో మనీష్ సిసోడియాకు సంబంధం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఏడాదిన్నర క్రితం సీబీఐ, ఈడీ అధికారులు సిసోడియాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. లిక్కర్ స్కామ్ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండూ విచారిస్తున్నాయి. ఈ క్రమంలో మనీష్ సిసోడియాను రెండు దర్యాప్తు సంస్థలకు చెందిన అధికారులూ ప్రశ్నిస్తున్నారు.

# ఖతార్ నిర్బంధంలోని అధికారులను విడిపించేందుకు కృషి : జైశంకర్

న్యూ డిల్లీ అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); గూఢచర్యం కేసులో భారత నావికాదళానికి చెందిన 8 మంది మాజీ అధికారులకు మరణదండన విధిస్తూ ఖతార్ కోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, ఆ 8 మంది అధికారులను విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జై శంకర్ వెల్లడించారు. సోమవారం ఆయన బాధిత కుటుంబాలను కలిశారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ కష్టకాలంలో అన్ని విధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చినట్లు చెప్పారు. 'ఖతార్‌లో నిర్బంధించబడిన 8 మంది భారతీయుల కుటుంబాలను ఈ ఉదయం కలిశాను. ఈ కేసుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు వారికి తెలియజేశా. బాధిత కుటుంబాల ఆందోళనలు, ఆవేదనలు, బాధలు మాకు పూర్తిగా అర్థమవుతున్నాయి. వారి విడుదలకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఆ కేసు వివరాలను ఎప్పటికప్పుడు బాధిత కుటుంబాలకు తెలియజేస్తాం' అని ఆయన ట్వీట్ చేశారు.

# వైట్ హౌస్ ముందు ప్రతి పౌరుడు స్వేచ్ఛగా నిరసన తెలిపే అవకాశం ఏర్పాటు

## – అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు వీరాంజనేయులు

న్యూ డిల్లీ అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వాషింగ్టన్ డిసి లోని అగ్ర రాజ్యాధినేత జో బైడన్ అధికారిక నివాసమైన వైట్ హౌస్ ను, ది అమెరికా క్యాపిటల్ సెనేట్ కార్యాలయాన్ని, ప్రపంచంలోనే అతి పెద్దదైన యునైటెడ్ స్టేట్స్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ ను అఖిల భారత పంచాయతీ పరిషత్( న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వీరాంజనేయులు ఆయన మాట్లాడుతూ అమెరికా పరిపాలన భవనమైన ది క్యాపిటల్ సెనేట్ అది ఒక గొప్ప ప్రజాస్వామ్య చట్టాలను చేసే దేవాలయం అక్కడ ఎన్నో అద్భుత కళాఖండాలను ఏర్పాటు చేశారన్నారు. తొలి అమెరికా అధ్యక్షుడు వాషింగ్టన్ నుంచి అనేకమంది అమెరికా అధ్యక్షుల విగ్రహాలు అనేకమంది మేధావుల విగ్రహాలను చాలా అద్భుతంగా తీర్చిదిద్దారు ఇక్కడ కట్టడాలు కానీ, యునైటెడ్ స్టేట్స్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ లో 26 మిలియన్ గ్రంధాలు కరపత్రాలతో సహా 90 మిలియన్ అంశాలు దీనిలో ఉన్నాయని తెలిపారు. ఈ గ్రంథాలయ సిబ్బంది 3,597 మంది. గ్రంథాలయ డైరెక్టర్ జేంస్ బిల్లింగ్టన్. లైబ్రరీ లో అద్భుతమైన పెయింటింగ్స్ కానీ ఎన్నో గ్రంథాలు ఇక్కడ ఉండటం విశేషం ఇక్కడ తీర్చిదిద్దిన కళా కృతులు ప్రపంచంలోనే ఒక అద్భుతం అని అన్నారు ఇక్కడ వైట్ హౌస్ అమెరికా అధ్యక్షుని అధికారిక నివాసం ముందు ప్రతి పౌరుడు స్వేచ్ఛగా మాట్లాడే హక్కును, నిరసన తెలిపే హక్కును ఇక్కడ ప్రభుత్వం ప్రపంచంలో ఉన్న ఏ దేశ పౌరుడైనా ఇక్కడ నిరసన తెలిపే హక్కును కూడా ఏర్పాటు చేయటం చాలా అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ గొల్లపూడి నాగ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు

# ఆంధ్రప్రదేశ్ దుర్ఘటన గురించి కేంద్ర రైల్ వే మంత్రి శ్రీ అశ్వినివైష్ణవ్‌తో మాట్లాడిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ఆంధ్ర ప్రదేశ్ లో జరిగిన రైలు దుర్ఘటన ను గురించి కేంద్ర రైల్ వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడారు. అలమండ మరియు కంటకాపల్లి సెక్షన్ మధ్య మార్గం లో రైలు దురదృష్టవశాత్తు పట్టాలు తప్పిన దుర్ఘటన దరిమిలా తలెత్తిన స్థితి ని గురించి శ్రీ నరేంద్ర మోదీ మంత్రి ని అడిగి తెలుసుకొన్నారు. మృతుల కుటుంబాల కు శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గాయపడిన వ్యక్తులు త్వరగా పునఃస్వస్థులు కావాలంటూ ఆ ఈశ్వరుడి ని ఆయన ప్రార్థించారు.

మృతుల దగ్గరి సంబంధికుల కు 2 లక్షల రూపాయల వంతు న పరిహారాన్ని ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుండి ఇవ్వడం జరుగుతుందని కూడాను ప్రధాన మంత్రి ప్రకటించారు. అదే విధం గా, రైలు ప్రమాదం లో గాయపడిన వారి కి 50,000 రూపాయల వంతున ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

"ప్రధాన మంత్రి శ్రీ రైల్ వే శాఖ మంత్రితో మాట్లాడి, అలమండ మరియు కంటకాపల్లి సెక్శన్ మధ్య మార్గం లో రైలు దురదృష్టవశాత్తు పట్టాల ను తప్పడం వల్ల ఏర్పడ్డ స్థితి ని గురించి అడిగి తెలుసుకొన్నారు.

బాధిత వ్యక్తుల కు అధికారులు చేతనైన అన్ని విధాలు గాను సహాయాన్ని సమకూర్చుతున్నారు. ప్రియతముల ను కోల్పోయిన కుటుంబాల కు సంతాపాన్ని ప్రధాన మంత్రి వ్యక్తం చేయడం తో పాటు గాయపడ్డ వ్యక్తులు త్వరగా పునఃస్వస్థులు కావాలంటూ ఆ ఈశ్వరుడి ని ప్రార్థించారు.

అలమండ మరియు కంటకాపల్లి సెక్శను మధ్య రైలు పట్టాలు తప్పిన ఘటన లో మరణించిన వ్యక్తుల యొక్క దగ్గరి సంబంధికుల కు 2 లక్షల రూపాయల వంతున పరిహారాన్ని పిఎమ్ఎన్ఆర్ఎఫ్ నుండి చెల్లించడం జరుగుతుందని ప్రధాన మంత్రి ప్రకటించారు. గాయపడ్డ వ్యక్తుల కు 50,000 రూపాయల వంతున ఇవ్వడం జరుగుతుంది." అని తెలిపింది.

# రైలు ప్రమాద బాధితుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి - భారాస ఏపీ అధ్యక్షుడు తోట

అమరావతి, అక్టోబర్ 31:విజయ నగరం జిల్లాలోని కంటకావల్లి అలమండ సమీపంలో రైలు ప్రమాదం జరగటం దురదృష్టకరమని భారత రాష్ట్ర సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రమాద ఘటనలో మృతి చెందిన ప్రయాణికుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇటీవల కాలంలో దేశంలో రైలు ప్రమాద ఘటనలు పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. రైలు ప్రమాదాలు నివారించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఒరిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటన మరవకముందే మరోమారు రైలు ప్రమాదం జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలున్నా వాటిని సరిదిద్దకుండా రైల్వే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. కేవలం ప్రమాదాలు జరిగినప్పుడు తూతు మంత్రంగా తాత్కాలిక చర్యలు చేపడుతున్నారే తప్ప అధికారులు శాశ్వతంగా ప్రమాదాలను నివారించలేకపోతున్నారన్నారు. రైల్వేలను ప్రైవేటుపరం చేసే దుష్ట ఆలోచనలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. ప్రయాణికుల భద్రతకు భరోసా ఇవ్వలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి ప్రాణ నష్టం నివారించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదంలో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులకు కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించి రెండు లక్షల రూపాయల పరిహారం అందించాలన్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం 25 లక్షల రూపాయల నష్టపరిహారం అందించి వారి కుటుంబాల్లో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొని తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ పార్టీలో ఎగిసిపడుతున్నాయి అసంతృప్తి జ్వాలలు

మహబూబ్‌నగర్ అక్టోబర్ 31(ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. టికెట్ల కేటాయింపుపై నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ అధిష్టానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బులకు ఆశపడి టికెట్లు అమ్ముకున్నావని ఏకంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై దుమ్మెత్తి పోస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో దేవరకద్ర కాంగ్రెస్ నాయకులు మరింత రెచ్చిపోయారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పై దాడి చేసి పీసీసీ అధ్యక్షుడు చాంబర్లు ధ్వంసం చేశారు. దేవరకద్ర కాంగ్రెస్ టికెట్‌ను బీసీ నేత ప్రదీప్ గౌడ్‌ను కాదని మధుసూదన్ రెడ్డికి ఇవ్వడంతో ఆగ్రహం చెందినా ఆ నియోజకవరానికి చెందిన కార్యకర్తలు సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో హంగామా సృష్టించారు. తనకు టికెట్ ఇవ్వకుండా తీవ్రంగా అవమానించిన పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేవరకద్ర టికెట్ తనకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏం చేయాలో కార్యకర్తలే నిర్ణయిస్తారని ప్రకటించి బయటికి వెళ్లారు. దీంతో ఆగ్రహం చెందిన ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ పార్టీ ఆఫీసులోకి చొరబడి కుర్చీలను, బ్యానర్ల చించి కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కుర్చీలు అన్నింటిని తగలబెట్టే ప్రయత్నం చేశారు. ఆ పార్టీ కార్యాలయం ఆవరణ మొత్తం పీకి పందిరి వేశారు. తమ నేతకు టికెట్ ఇవ్వకుంటే పార్టీని ఓడిస్తామని శపథం చేశారు.

# గాల్లోకి కరెన్సీ నోట్లు విసురుతూ.. బాణా సంచా కాలుస్తూ... ముగ్గురి అరెస్ట్

లక్నో అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ ) ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియా బాద్ లో కొందరు పుట్టినరోజు వేడుకల సందర్భంగా గాల్లోకి కరెన్సీ నోట్లు విసురుతూ.. బాణా సంచా కాలుస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. వీడియో ఆధారంగా ముగ్గురు వ్యక్తుల్ని అరెస్ట్ చేశారు. రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఓ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ లోపల ముగ్గురు వ్యక్తులు కారుపైకప్పు పై నిలబడి బాణసంచా కాలుస్తూ.. డబ్బులు వెదజల్లారు. అపార్ట్‌మెంట్ యజమానుల సంఘం వీడియో తీసి ఎక్స్‌లో పోస్ట్ చేయగా.. అదికాస్తా వైరల్‌గా మారింది. ఈ వీడియోపై పోలీసులు స్పందించారు. వీడియో ఆధారంగా సదరు యువకు లపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నంద్‌గ్రామ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రవి కుమార్ సింగ్ మాట్లాడుతూ.. యువకులు అభ్యంతరకరమైన పదాలు ఉపయోగించారని, ఆ ప్రాంతంలో అల్లకల్లోలం సృష్టించాన్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

# భారతీయ రిపబ్లికన్ పార్టీలో చేరిన హెచ్ఎండీ నసీర్



హైదరాబాద్ అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న హెచ్ఎండీ నసీర్ భారతీయ రిపబ్లికన్ పార్టీ (ఆర్పిఐ) లో చేరారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో ఆర్పిఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి.స్వామి సమక్షంలో నసీర్ పార్టీ లో చేరారు. ఆయనకు స్వామి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హెచ్ఎండీ నసీర్ మీడియా తో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రాంతం రిచ్ ప్రాంతం ఐనప్పటికీ ఈ ప్రాంతం లో కుడా అనేకమంది నిరుపేదలు జేవిస్తున్నారని అన్నారు అలాంటివారిని గుర్తించి రాజ్యాంగబద్దంగా వారి హక్కులను కాపాడుతూ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పరంగా రావలసిన పతకాలను కుల మతాలకు అతీతంగా వారికి అందే విదంగా కృషి చేస్తానన్నారు. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో ప్రజలు తనకు ఓటు వేసి అత్యదిక మెజారిటి తో గెలిపిస్తారన్న ఆశాబావాన్ని వ్యక్తం చేసారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల నాయకత్వాన్ని అపహాస్యం చేయడం సిగ్గు చేటు

## –తీవ్రంగా ఖండించిన బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్

హైదరాబాద్ అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీసీల రాజకీయ పోరాటం మొదలైంది.. అందుకనే అనివార్యంగా అన్ని పార్టీలు బీసీల జపం చేస్తున్నాయని,ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీల నాయకత్వాన్ని అపహాస్యం చేయడం సిగ్గు చేటని, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం బాగ్లింగంపల్లిలోని సమితి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా బీసీల జనాభా శాతాన్ని బీసీ రాజ్యాధికార సమితి బయట పెట్టడం కేసీఆర్ కు రుచించడం లేదు.. అందుకే మా మీద అబాండాలు..మేము మా జనాభా శాతం ఇంత అని ప్రసంగాలు నర్కడం లేదన్నారు. మా అవకాశాలను దోపిడీ చేస్తున్న పార్టీలను మా ఓట్లతో రాజకీయంగా నరికే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. సమగ్ర కుటుంబ సర్వే 2014 లోనే చేపట్టినప్పటికీ బీసీల జనాభాను ఎందుకు ఈ ప్రభుత్వం బహిర్గతం చేయలేదు .. తెలంగాణ రాష్ట్రంలో కులగణన ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. బీసీలను పథకాలకు పరిమితం చేసే కాలం పోయింది.. బీసీలకు రాజకీయ వాటా రాజ్యాధికారం దక్కాల్సిందే నన్నారు. తెలంగాణ ఒక్కరోజులో ఏర్పాటు కాలే అలానే బీసీల రాజ్యం కూడా ఎంతో దూరంలో లేదు ఈ విషయాన్ని కేసిఆర్ గమనించాలన్నారు. బీసీల నాయకత్వాన్ని అవమానపరిస్తే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కు భంగపాటు తప్పదన్నారు. బలమైన బీసీ ప్రాతినిధ్య స్థానాల్లో ప్రభుత్వానికి బీసీ ఓటర్లు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు.

# పుంగనూరు వద్ద ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమ - ఎస్ఐపీబీ ఆమోదముద్ర

తిరుపతి, అక్టోబర్ 31:చిత్తూరు జిల్లా పుంగనూరు వద్ద రూ 4,500 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు( ఎస్ఐపీబీ). ఈ రోజు ఆమోద ముద్ర వేసింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రూ 19 వేల కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు అయ్యే పలు పరిశ్రమలకు, కొన్ని పరిశ్రమల విస్తరణలకు ఆమోదం లభించింది. అందులో భాగంగా ప్రముఖ రవాణా సంస్థ పెప్పర్ మోషన్ కంపెనీ. రూ 4,640 కోట్ల పెట్టుబడితో చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ఆమోదం లభించింది.

ఆ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 8 వేల మందికి, పరోక్షంగా మరో 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి . అదేవిధంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలో ఉన్న ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ రూ. 933 కోట్ల పెట్టుబడితో చేయతలపెట్టిన విస్తరణ. కు కూడా ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆ విస్తరణ ద్వారా 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్టు సంబంధిత అధికారులు తెలియచేస్తున్నారు. ఈ పరిణామం తో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న పరిశ్రమల పరంపర లో భాగంగా ఈ రెండు పరిశ్రమల వల్ల దాదాపు 10 వేలమందికి ప్రత్యక్షంగా, మరో 15 వేలమందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు కలగనుంది.

# జీవో నంబర్ 1411 విచారణ వచ్చేనెల 16కు వాయిదా

అమరావతి అక్టోబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జీవో నంబర్ 1411, 344ను సవాలు చేస్తూ టీడీపీ నేతలు దాఖలు చేసిన పిటిషన్స్‌పై విచారణ హైకోర్టులోవాయిదా వేసింది.

గత ప్రభుత్వ నిర్ణయాలను పునఃసమీ క్షిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం, సిట్ ఏర్పాటును సవాలు చేస్తూ పిటిషన్స్ దాఖలయ్యాయి. అమరావతి భూములు వ్యవహారం, ఫైబర్ నెట్ స్కాంతో పాటు గత ప్రభుత్వ నిర్ణయాలు, చేపట్టిన ప్రాజెక్ట్స్ సమీక్షకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో 1411 జీవో జారీ చేసింది. అలాగే మంత్రి వర్గ ఉప సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా దర్యాప్తుకు సిట్‌ను ఏర్పాటు చేస్తూ మరో జీవో 344 వచ్చింది. ఈ రెండూ జీవోలను సవాలు చేస్తూ టీడీపీ నేతలు వర్ల రామయ్య ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్‌పై ఈరోజు కోర్టులో విచారణకు వచ్చింది. తదుపరి విచారణను వచ్చేనెల 16కు వాయిదా వేసింది.

# దేశ యువతకు ఉద్దేశించినటువంటి 'ఎమ్ వై భారత్' ఒకే చోటులో సంపూర్ణ ప్రభుత్వ వేదికగా ఉండబోతోంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 అక్టోబరు 31 వ తేదీ నాడు కర్తవ్య పథ్ లో సాయంత్రం సుమారు 5 గంటల వేళ కు ఏర్పాటైన 'మేరీ మాటీ మేరా దేశ్' ప్రచార ఉద్యమం తాలూకు అమృత్ కలశ్ యాత్ర ముగింపున కు చేరుకొన్నట్లు గా తెలియజేసేటటువంటి ఒక కార్యక్రమం లో పాలుపంచుకోనున్నారు. ఈ కార్యక్రమం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ యొక్క ముగింపు ఘట్టం గా కూడా ఉంటుంది.

ఈ కార్యక్రమం లో భాగం గా అమృత్ వాటిక ను మరియు అమృత్ మహోత్సవ్ స్మారకాన్ని ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు. ఆయన దేశం లో వివిధ ప్రాంతాల నుండి ఈ కార్యక్రమం లో జతపడే వేల మంది అమృత్ కలశ్ యాత్రికుల ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

దేశ యువత కు ఉద్దేశించిన 'మేరా యువ భారత్' (మై భారత్) వేదిక ను కూడా ప్రధాన మంత్రి ఈ కార్యక్రమం లో భాగం గా ప్రారంభించనున్నారు.

దేశం కోసం సర్వోన్నత త్యాగాన్ని చేసిన వీరుల కు మరియు వీరాంగనల కు ఒక శ్రద్ధాంజలి గా 'మేరీ మాటీ మేరా దేశ్' ప్రచార ఉద్యమాన్ని చేపట్టడం జరిగింది. జన్ భాగీదారీ (ప్రజల భాగస్వామ్యం) భావన తో సాగిన ఈ ప్రచార ఉద్యమం లో భాగం గా దేశమంతటా పంచాయతీ/పల్లె, బ్లాకు, పట్టణ స్థానిక సంస్థ, రాష్ట్ర స్థాయి మరియు జాతీయ స్థాయి లో అనేక కార్యక్రమాల ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల లో సర్వోన్నత త్యాగాన్ని చేసిన శూరులైన వ్యక్తుల కు హృదయ పూర్వకమైన కృతజ్ఞత ను వ్యక్తం చేయడం కోసం శిలాఫలకం (స్మారక చిహ్నం) యొక్క నిర్మాణం; ఆ శిలాఫలకం వద్ద ప్రజలు 'పంచ్ ప్రణ్' ప్రతిజ్ఞ ను స్వీకరించడం; స్వదేశీ ప్రజాతుల కు చెందిన మొక్కల ను నాటి వాటి కి నీటిని అందించడం తో పాటు 'అమృత్ వాటిక' (వసుధ వందన్) ను అభివృద్ధి పరచడం, స్వాతంత్ర్య సమరయోధుల మరియు అమరులైన స్వాతంత్ర్య యోధుల కుటుంబాల ను గౌరవించుకోవడం కోసం (వీరోన్ కా వందన్) అభినందన కార్యక్రమాలు వంటివి చోటు చేసుకొన్నాయి.

ఈ ప్రచార ఉద్యమం పెద్ద ఎత్తున సఫలం అయింది; దీని లో భాగం గా.. 36రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల లో 2.3 లక్షల కు పైచిలుకు శిలాఫలకాల ను నిర్మించడమైంది, సుమారు 4 కోట్ల 'పంచ్ ప్రణ్' ప్రతిజ్ఞ స్వీకారం తాలూకు సెల్ఫీల ను అప్ లోడ్ చేయడమైంది, దేశవ్యాప్తం గా 2 లక్షల పైచిలుకు 'వీరోం కా వందన్' కార్యక్రమాల నిర్వహించడమైంది, 2.36 కోట్ల కు పైగా స్వదేశీ మొక్కల ను నాటడం తో పాటుగా దేశమంతటా 'వసుధ వందన్' ఇతివృత్తం లో భాగం గా 2.63 లక్షల అమృత్ వాటిక ల ను ఏర్పాటు చేయడం వంటి కార్యాలు పూర్తి అయ్యాయి.

'మేరీ మాటీ మేరా దేశ్' ప్రచార ఉద్యమం లో అమృత్ కలశ్ యాత్ర కూడా ఒక భాగం గా ఉంది; ఈ కార్యక్రమం లో గ్రామీణ ప్రాంతాల లో 6 లక్షల కు పైగా గ్రామాల నుండి మరియు పట్టణ ప్రాంతాల లోని వార్డుల నుండి మట్టి ని, ఇంకా బియ్యాన్ని సేకరించడమైంది. గ్రామాల మట్టి ని బ్లాకు స్థాయి లో కలిపివేసి, ఆ మట్టి ని రాష్ట్ర రాజధాని కి చేర్చడం జరిగింది. ఆ తరువాత వేల కొద్దీ అమృత్ కలశ్ యాత్రికుల తో రాష్ట్ర స్థాయి నుండి మట్టి ని దేశ రాజధాని కి పంపించడం జరుగుతుంది.

అమృత్ కలశ్ యాత్ర లో భాగం గా 2023 అక్టోబరు 30 వ తేదీ నాడు అన్ని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల కు ప్రాతినిధ్యం వహించే బ్లాకు మరియు పట్టణ స్థానిక సంస్థల కు చెందిన మట్టి నమూనాల ను 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' భావన ప్రస్ఫుటం అయ్యే విధం గా ఒక విశాలమైన అమృత్ కలశ్ లో నింపడం జరుగుతుంది. అక్టోబరు 31 వ తేదీ నాడు ప్రధాన మంత్రి దేశవ్యాప్తం గా ఈ కార్యక్రమం లో పాల్గొనే వేల కొద్దీ అమృత్ కలశ్ యాత్రికుల ను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

దేశం లోని ప్రతి ఒక్క భాగం నుండి ఒక చోటు కు చేర్చే మట్టి ని కర్తవ్య పథ్ లో అమృత్ వాటిక మరియు అమృత్ మహోత్సవ్ మెమోరియల్ లను నిర్మించడాని కై ఉపయోగించడమైంది. ఈ అమృత్ వాటిక మరియు అమృత్ మహోత్సవ్ మెమోరియల్ లను ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారు.

'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' యొక్క ముగింపు కార్యక్రమం గా 'మేరీ మాటీ మేరా దేశ్' ప్రచార ఉద్యమాన్ని సంకల్పించడమైంది. భారతదేశం స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భాన్ని ఉత్సవం గా జరుపుకొనే క్రమం లో 2021 మార్చి నెల 12 వ తేదీ నాడు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ మొదలు పెట్టడమైంది. అటు తరువాత, దేశం లో అన్ని ప్రాంతాల లో ప్రజలు ఉత్సాహం గా పాలుపంచుకోవడం తో రెండు లక్షల కు పై చిలుకు కార్యక్రమాల ను నిర్వహించడం జరిగింది.

దేశం లో యువతీయువకుల కై ఒకే చోటు లో సంపూర్ణ ప్రభుత్వ వేదిక గా సేవల ను అందించడం కోసం ఒక స్వతంత్ర సంస్థ గా మేరా యువ భారత్ (మై భారత్ ) ను ఏర్పాటు చేయడం జరుగుతున్నది. దేశం లో ప్రతి ఒక్క యువతి కి, ప్రతి ఒక్క యువకుని కి సమానమైన అవకాశాల ను అందించాలన్న ప్రధాన మంత్రి దృష్టికోణాని కి అనుగుణం గా మై భారత్ సాంకేతిక విజ్ఞానాన్ని అండ గా తీసుకొంటూ ప్రభుత్వం లోని అన్ని విభాగాల లో ఒక సానుకూల యంత్రాంగాన్ని అందించేందుకు గాను ఉద్దేశించిడమైంది. దీని ద్వారా యువతీ యువకులు వారి ఆకాంక్షల ను నెరవేర్చుకోవడానికి తోడు 'వికసిత్ భారత్' ఆవిష్కారాని కి వారి వంతు తోడ్పాటు ను అందించాలి అనేదే లక్ష్యం గా ఉంది. యువత సామాజిక పరివర్తన కు ప్రతినిధులు గా, జాతి నిర్మాణం లో పాత్రదారులు గా నిలవడం తోపాటు, ప్రభుత్వాని కి మరియు పౌరుల కు మధ్య 'యువ సేతు' వలె వ్యవహరించేటట్లు గా వారిని తీర్చిదిద్దాలని అనేది సైతం మై భారత్ యొక్క లక్ష్యం గా ఉంది. ఈ కోవ లో మై భారత్ అనేది దేశం లో యువత ప్రధాన స్థానం లో నిలచేటటువంటి అభివృద్ధి అనే ఆశయాని కి పెద్ద ప్రోత్సాహకాన్ని అందించనుంది.

# ఏసీబీ వలలో అవినీతి చేప - లంచం తీసుకుంటూ చిక్కిన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఉపేందర్

కరీంనగర్, అక్టోబర్ 31 : అవినీతి నిరోధక శాఖ అధికారులకు అవినీతి చేప చిక్కింది. సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఉపేందర్ రావు రూ. 13 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. జిల్లాలోని వీర్లపెల్లి మండలం అడవి పదిర గ్రామానికి చెందిన భూక్యా సరిత టిప్పర్ సబ్సిడీ కోసం కమిషనర్ ఆఫ్ ఇండస్ట్రీస్ హైదరాబాద్ కు దరఖాస్తు చేసుకోగా, సబ్సిడీ మంజూరీ కోసం సరితకు అనుకూలంగా పంపడానికి రూ. 30 వేలు లంచం డిమాండ్ చేశారు.

దీనితో రూ.17వేలు ఈనెల 26న తీసుకోగా, సోమవారం మిగతా 13 వేల రూపాయలను సరిత మరిది భూక్య శివకుమార్ వద్ద నుండి సిరిసిల్ల పట్టణంలోని గీత నగర్ జడ్పీ హై స్కూల్ లో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ సంఘటనలో కేసు నమోదు చేసి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్ రావు ను ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డిఎస్పీ వి.వి రమణమూర్తి తెలిపారు. ఏ అధికారైన అవినీతికి పాల్పడితే 9154388954 సంప్రదించాలని కోరారు.

# హాస్టల్ తనిఖీ చేసిన పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసిల్దార్



రంగా రెడ్డి అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );పాఠశాలలకు,సంక్షేమ వసతి గృహాలకు అందించే బియ్యం నాణ్యత లో రాజీ ప్రసక్తే లేదని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాశిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు సోమవారం నాడు ఆయన కడ్తాల్ లో గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు.ఈ సంధర్భంగా తమ్ముడూ..అన్నం ఎలా ఉంది.బావుంది సార్.ఇలా విద్యార్థుల నుంచి ఆత్మీయంగా మాట్లాడి.. వారికి అందుతున్న ఆహారం పై ఆరా తీశారు. అనంతరం రఘునందన్ మాట్లాడుతూ ..విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఇస్తున్న బియ్యం నాణ్యత ను పరిశీలించానన్నారు. విద్యార్థులు ఎందరు.గారు తింటున్న అన్నం ఎలా ఉంటుందని పలువురు విద్యార్థుల ను అడిగి తెలుసుకున్నారు.

# రైలు ప్రమాద బాధితులకు జగన్ పరామర్శ.. అన్నివిధాల అండగా ఉంటామని భరోసా..



అమరావతి, అక్టోబర్ 31:విజయనగరం జిల్లా కంకటాపల్లి వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో బాధితులుగా ఉన్న క్షతగాత్రులను సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. వాస్తవానికి సిఎం పర్యటనలో భాగంగా తొలుత ప్రమాద జరిగిన ఘటన స్థలానికి వెళ్లాల్సి ఉన్నప్పటికీ రైల్వే అధికారుల వినతి మేరకు ఆయా పర్యటనను సిఎంవో అధికారులు రద్దు చేశారు. సిఎం పర్యటనకు వస్తే ఆయా ప్రాంతంలో పునరుద్దరణ పనులు మరింత ఆలస్యమవుతాయనే విషయాన్ని రైల్వే అధికారులు సిఎం దృష్టికి తీసుకువెళ్లారు, దీంతో సిఎం జగన్ విశాఖ విమానాశ్రయం నుంచి నేరుగా విజయనగరం హెలికాప్టర్‌లో చేరుకుని, జిల్లా సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి వారికి ధైర్యాన్ని చెప్పారు.

ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగానే ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రతి క్షతగాత్రునికి మెరుగైన వైద్యసేవలందించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పూర్తిగా కొలుకునేంతవరకూ ప్రభుత్వం తోడుగా నిలుస్తుందన్నారు. అదే విధంగా మృతిచెందిన కుటుంబాటలకు, క్షతగాత్రులకు ఎక్స్‌గ్రేషియాను సత్వరమే అందించాలని సిఎం జగన్ అధికారులను ఆదేశించారు.

# రేషన్ షాపుల్లో పప్పుధాన్యాల సరఫరా.. నేటి నుంచే ప్రారంభం



అమరావతి, అక్టోబర్ 31:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. నవంబర్ నుంచి కందిపప్పును కూడా పంపిణీ చేయనుంది.

ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తోంది. నిజానికి కొద్ది నెలల క్రితమే కందిపప్పును కూడా ఇస్తామని పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. కానీ, కందిపప్పు కొరత కారణంగా పంపిణీ చేయలేకపోయింది. అయితే నవంబర్ నుంచి కచ్చితంగా ఏపీలోని అన్ని చౌక ధరల దుకాణాల్లో రేషన్ బియ్యంతో పాటు కందిపప్పును కూడా ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

ప్రస్తుతం మార్కెట్లో కిలో కందిపప్పు ధర నాణ్యతను బట్టి రూ.130 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. అయితే రేషన్ కార్డు లబ్ధిదారులకు సబ్సిడితో కిలో కందిపప్పును రూ. 67 కే అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు 50,000 టన్నుల కందిపప్పును కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో కేంద్రాన్ని కోరింది.

ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తికి స్పందించిన కేంద్రం.. హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (ఊంఅం) నుంచి 10 వేల టన్నుల కందిపప్పును కొనుగోలు చేయాలని ఏపీ ప్రభుత్వానికి సూచించింది. దీంతో ప్రభుత్వం వెంటనే హాకా కు 10 వేల టన్నుల కందిపప్పు సరఫరా చేయాలని ఆర్డర్ చేసింది. అయితే హాకా వద్ద నిల్వలు లేకపోవడంతో ప్రస్తుతం 7,200 టన్నుల కందిపప్పు మాత్రమే సరఫరా చేస్తామని తెలిపింది.

దీంతో నవంబర్, డిసెంబ్, జనవరి నెలల్లో కందిపప్పు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముందుగా హాకా నుంచి తొలి విడతలో 3,660 టన్నుల కందిపప్పును ప్రభుత్వం అందుకోనుంది. రెండో విడతలో 3,540 టన్నుల సరఫరా కానుంది. నవంబర్ లో రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు 2,300 టన్నుల కందిపప్పును తరలిస్తున్నారు.

# కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా- బీజేపీ అభ్యర్థి ధన్ పాల్

నిజామాబాద్, అక్టోబర్ 31: కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని బీజేపీ అభ్యర్థి ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. కార్మికుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమాలు ప్రవేశ పెట్టిందన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలో ఎంకే గార్డెన్ లో కొత్త గంజ్ లో గుమస్తా, దడువై, హమాలీ, చాట, ముల్లె, యూనియన్ సభ్యుల ఆత్మీయ సమావేశా నికి బీజేపీ అభ్యర్థి ధన్ పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడుతూ కొత్త గంజ్ కార్మిక సోదర, సోదరిమనులే శ్రీ రామరక్షా అని అన్నారు.

ఎన్నికల సమయంలో వచ్చే ప్యారాచూట్ లీడర్ లని నమ్మొద్దన్నారు. మీ సంఘాలకి అన్ని విధాలా అండగా ఉంటానన్నారు. తన ట్రస్ట్ ద్వారా చాలా మందికి సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. భవిష్యత్తు లో మీ అందరి ఆశీర్వాదం తన పైన ఉండాలన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్న కార్మిక భవన్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మర్చంట్ అధ్యక్షులు లభిషెట్టి శ్రీనివాస్, గుమస్తా ఆధ్యక్షులు కరిపె సత్యం, దడువై అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, హమలి అధ్యక్షులు సాయిలు కార్యదర్శులు బాలు, సాయిలు, కరిపె గణేష్, కార్మిక సోదరులు గంజ్ యునియన్ నాయకులు పాల్గొన్నారు.

# స్టిక్కర్ ప్రభుత్వంగా వైసీపీ పని చేస్తోంది

## –బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తీవ్ర విమర్శలు

విజయవాడ అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి జగన్ ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు. స్టిక్కర్ ప్రభుత్వం గా వైసీపీ పని చేస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగునీటి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, దుర్భిక్షంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సమస్యల పట్ల ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. ఏపీలో సాగునీటి ప్రాజెక్టుల పనులు జరగడం లేదని, రాష్ట్రంలో రైతుల ఆత్మ హత్యలు పెరిగాయన్నారు.జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని పురంధేశ్వరి ఆరోపించారు. మేనిఫెస్టో లో చెప్పిన విధంగా శీతల గిడ్డంగులు ఏవని ప్రశ్నించారు. ధరల స్థిరీకరణ నిధి ఏమైందని.. దీనికి ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు ఎన్ని ప్రాజెక్టులు కట్టారు?.. అన్నమయ్య ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం ఏం చేసిందని నిలదీశారు. జేబులు నింపుకోవడం.. మొక్కుబడి పనులు చేయడం.. మద్యం, మైనింగ్‌ల పేరుతో కోట్ల రూపాయల దోపిడీ జరుగుతోందని, ఈ అంశాలన్నీ ప్రజల్లోకి తీసుకువెళతామని పురంధేశ్వరి స్పష్టం చేశారు.

# నామినేషన్లకు ఏర్పాట్లు చేయాలి-జిల్లా కలెక్టర్ గౌతమ్



మేడ్చల్, అక్టోబర్ 31: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నామినేషన్ల ప్రక్రియకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నామినేషన్లను స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ ఆర్వోలు, ఈఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ కార్యాలయాల వద్ద నామినేషన్లకు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్లు స్వీకరించే మొదటి రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయాలన్నారు.

అత్యవసర సేవల పరిధిలోని శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

అత్యవసర సేవల పరిధిలోని శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి నవంబర్ 7వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఇందులో భాగంగా 13 శాఖలకు సంబంధించి బ్యాలెట్ ఓట్లు వేసేందుకు ప్రత్యేకంగా అవకాశం ఉన్నదన్నారు.

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్, భారతీయ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆలిండియా రేడియో, విద్యుత్‌శాఖ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రాష్ట్ర రవాణా సంస్థ, ఆహారం, పౌరసరఫరాలు, బీఎస్ఎన్ఎల్, పోల్ డే కవరేజ్, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన మీడియా వ్యక్తులు, అగ్నిమాపక సేవలు, తదితర శాఖల్లో విధులు నిర్వర్తిస్తూ.. ఓటు హక్కును వినియోగించుకోలేని వారు మాత్రమే దరఖాస్తులను ఫారం(12-డీ) లో తమ పూర్తి వివరాలతో రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం అర్హత గల ఓటర్ల జాబితాను తయారు చేసి, వారికి పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అందజేస్తారని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో డీఆర్వో హరిప్రియ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేశ్ వ్యాస్ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీబీ శబరీశ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రన్ ఫర్ యూనిటీ.

అమరావతి, అక్టోబర్ 31: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల చివరి రోజు సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ సమైక్యతను చాటుతూ జిల్లా పోలీసు యంత్రాంగం యూనిటీ రన్ ను కర్నూలు లో ఘనంగా నిర్వహించారు. ఏక్తా పరుగు కార్యక్రమాన్ని కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి. నాగబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఐక్యతా పరుగు జిల్లా పోలీసు కార్యాలయం ( కొండారెడ్డి బురుజు ) నుండి ప్రారంభమై రాజ్ విహార్ కూడలి వరకు కొనసాగింది. ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ పోలీసు సిబ్బంది బయలు దేరి రాజ్ విహార్ సెంటర్ కు చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న సివిల్, ఎఆర్ , ఎపిఎస్పీ పోలీసు సిబ్బందితో ఎఆర్ అడిషనల్ ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు.

"భద్రతను కాపాడడానికి స్వయంగా అంకితమవుతామని , ఈ సందేశాన్ని తోటివారందరిలో విస్తరింపచేయడానికి గట్టిగా కృషి చేస్తూ సత్యనిష్టతో ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క దార్శనికత, దేశ ఏకీకరణ స్ఫూర్తితో, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచడానికి స్వీయ తోడ్పాటును అందిస్తామని సత్యనిష్టతో తీర్మానం చేస్తున్నాము."ఎఆర్ అడిషనల్ ఎస్పీ రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం ఏక్తారన్ నిర్వహించామన్నారు.

# కార్యకర్తలు అందరు సమన్వయంతో పని చేయాలి



మహబూబాబాద్, అక్టోబర్ 30:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామంలో గడప గడపకు బిఆర్ఎస్ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్ రావుని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల పార్టీ నాయకులు మరియు స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, పాలకుర్తి దేవస్థానం కమిటి చైర్మన్ వెనుకదాసుల రాంచంద్రయ్య శర్మ మాట్లాడుతూ కార్యకర్తలు అందరు సమన్వయనీతో కలిసికట్టుగా పని చేసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ కేతిరెడ్డి సోమనరసింహ రెడ్డి, మండల నాయకులు పాకనాటి సోమరెడ్డి, పాకనాటి సునీల్ రెడ్డి, శ్రీరాం సుదీర్ , బొమ్మెరబోయిన రాజు,సలీదండి సుధాకర్, ముత్తినేని శ్రీనివాస్, బానోత్ వెంకన్న, శ్రీరాం సంజయ్, స్థానిక సర్పంచ్ సలీదండి మంజుల, ఎంపిటిసిలు ఎదునూరి శ్రీనివాస్,బానోత్ రవీందర్,మండల మహిళ సెల్ ఉపాధ్యక్షురాలు వెలపాటి రమాదేవి, ఎర్రసాని రామూర్తి, యూత్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ సెంటర్ల వద్ద నాలుగంచెల భద్రత

హైదరాబాద్, అక్టోబర్ 31:అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 3 నుంచి ప్రారంభం కానున్న అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను దృష్టిలో పెట్టుకుని పోలీసులు బందోబస్తుపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా నామినేషన్ కేంద్రాల చుట్టూ నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. సోమవారం కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సీపీ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద నాలుగు అంచెల భద్రతను ఏర్పాటు చేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున అభ్యర్థులు, వారి అనుచరులు వచ్చే అవకాశం ఉంటుందని, ఇది దృష్టిలో పెట్టుకుని సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసు అధికారులకు సూచించారు.

ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి ఇచ్చే అంశాలలో ఆర్ఓలను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు.

భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఇందులో భాగంగా డబ్బు, మద్యం, ఓటర్లను మభ్యపెట్టే ఇతర వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేసే విధంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో కేంద్ర బలగాల సహాయం తీసుకోవాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సైబరాబాద్ అదనపు సీపీ అవినాశ్ మహంతి, జాయింట్ సీపీ (ట్రాఫిక్) కె.నారాయణ్ నాయక్, బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, మేడ్చల్ డీసీపీ శబరీష్, మాదాపూర్ డీసీపీ సందీప్, రాజేంద్రనగర్ జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ డీసీపీలు అశోక్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోల్డెన్ నంది పురస్కారానికి చెరుకు శివ గౌడ్ ఎంపిక

నల్గొండ, అక్టోబర్ 31:స్థానిక చౌటుప్పల్ మున్సిపాలిటీ రాంనగర్ కాలనీకి చెందిన చెరుకు శివగౌడ్ ను గోల్డెన్ నంది అవార్డుకు ఎంపిక చేసినట్లుగా వల్లూరి ఫౌండేషన్ వారు విలేకరుల సమావేశంలో తెలియజేసారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, అసమర్థ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ పేదలకు, విద్యార్థులకు సమస్యలు వస్తే తన వంతు సహాయ సహకారాలు అందజేస్తూ ప్రజా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున చెరుకు శివ గౌడ్ కు ఈ పురస్కారం అందజేస్తున్నట్లుగా సంస్థ నిర్వాహకులు తెలియజేసారు.

ఈ అవార్డును నవంబర్ 5న పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం వేదికగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెరుకు శివగౌడ్ మాట్లాడుతూ? తన పుట్టినరోజున ఈ వార్త ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఇకపై రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# అవినీతిని వ్యతిరేకిద్దాం- జాతి ఉన్నతిని కాపాడుదాం




శంకర్ పల్లి, అక్టోబర్ 31: అవినీతిని వ్యతిరేకిద్దాం- జాతి ఉన్నతిని కాపాడుదామని శంకర్ పల్లి ఇన్ స్పెక్టర్ వినాయక్ రెడ్డి అన్నారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సమైక్యత దినోత్సవం, విజిలెన్స్ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమాన్ని భానూరు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రొడక్షన్ మేనేజర్ రాజారాం, శంకర్ పల్లి అవి వినాయక్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు, శంకర్ పల్లి బాలికల హాస్టల్ విద్యార్థులతో కలిసి మంగళవారం ఉదయం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శంకర్ పల్లి ఇన్ స్పెక్టర్ వినాయక రెడ్డి మాట్లాడుతూ సంస్థానాల విలీన ప్రక్రియలో మొండికేసిన మూడు సంస్థానాలను పోలీస్ యాక్షన్ ద్వారా భారతదేశంలో కలిపిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు.

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రొడక్షన్ మేనేజర్ రాజారాం మాట్లాడుతూ అవినీతిని వ్యతిరేకిద్దాం జాతిని ఐక్యం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.. జాతి ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు సందేశాన్ని వ్యాప్తి చేయడానికి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, ఉద్యోగులు శంకర్పల్లి ఎస్ హెచ్ ఓ సిబ్బంది పూర్తి సమన్వయంతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్ చంద్రమౌళి, తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. అవినీతిని అంత మొందించాలని పిలుపునిచ్చారు.

# టెంపుల్ ఓపెనింగ్ కోసం సర్పంచ్ పదవి వేలం.. రూ.9.35 లక్షలకు సర్పంచ్ ఎన్నిక

భూపాలపల్లి, అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ కోడ్ ను అమలు చేస్తుంది. కాగా గుంపుల కొద్ది జనం ఒక్క దగ్గర గుమకూడి ఉండకూడదు. ఎలాంటి కార్యక్రమాలు చేయొద్దు.. దీనికి విరుద్ధంగా నిబంధనలు ఉల్లంఘించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన కొంతమంది కుల పెద్దలు టెంపుల్ ప్రతిష్టాపన కార్యక్రమానికి కావలసిన ఖర్చులకోసం ఏకంగా సర్పంచి పదవిని వేలం వేశారు.

గ్రామస్తుల కథనం ప్రకారం.. మోగుల్లపల్లి మండలం అంకుషాపురం గ్రామంలో ఇటీవల పోచమ్మ తల్లి టెంపుల్ ను కొత్తగా కట్టారు. టెంపుల్ ప్రతిష్టాపనకు నవంబర్ 22న ముహూర్తం ఫిక్స్ అయింది. దీనికి కావాల్సిన ఖర్చులకు సరిపడా డబ్బులు లేకపోవడంతో కొంతమంది గ్రామంలోని పెద్ద మనుషులు హనుమాన్ టెంపుల్ సమీపంలో కూర్చుని సర్పంచ్ పదవికి వేలంపాడారు. మూడు లక్షలతో మొదలైన వేలంపాట రూ.9 లక్షల 35 వేలతో ముగిసింది.

ఈవేళ పాటలో దాదావు ఆరుగురు పాల్గొన్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పంచాయతీ సెక్రెటరీ సునీత రెడ్డి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పై విషయాన్ని మండల నోడల్ ఆఫీసర్ (ఎంపీడీవో) కృష్ణవేణికి సమాచారం అందించగా ఆమె వెంటనే స్థానిక ఎస్సై శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్ఐ సిబ్బందిని పురమాయించగా ఘటన స్థలంలో ఎవరు లేకపోవడంతో వేలంపాట నిర్వహణ గ్రామంలో ఎంక్వయిరీ చేసినట్లు తెలిసింది.

ఈ విషయంపై ఎంపీడీవోను వివరణ కోరగా.. ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి జనం ఒక్క దగ్గర కూడి వేలంపాట నిర్వహించిన మాట వాస్తవమేనని జివి సెక్రెటరీ సమాచారం ఇచ్చిందని ఎంక్వైరీ చేస్తున్నామని చెప్పారు. సర్పంచి పదవి కాలం పూర్తికి ఇంకా రెండు నెలలు ఉన్నప్పటికీ ముందే ఆ పదవికి వేలంపాట నిర్వహించడం మండలంలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో చర్చనీయాశంగా మారింది. ప్రజాస్వామ్యంలో ఓటుతో ప్రజా ప్రతినిధులు ఎన్నుకోవాలి తప్ప.. వేలం పాట వేయడం సరైంది కాదని.. ఇలాంటి ఘటనలపై ఉన్నత స్థాయి ఆఫీసర్లు సీరియస్ గా యాక్షన్ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# షాద్ నగర్ ప్రజల రుణం తీర్చుకుంటా -కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్



షాద్ నగర్, అక్టోబర్ 31 : షాద్ నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని షాద్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి విర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మంగళవారం పెద్దఎత్తన చేరికలు జరిగాయి. షాద్ నగర్ కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ సమక్షంలో జెడ్పీటీసీ సభ్యులు వెంకట్ రాంరెడ్డి ఆధ్వర్యంలో ఫరూక్ నగర్ మండలం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం జంగయ్య, అనంత రెడ్డి, గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో 100మంది పార్టీలో చేరారు. షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాద్ నగర్ లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ ఇస్తమని చెప్పి ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా ఇవ్వ లేదన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 34 లక్షల ఇందిరమ్మ ఇళ్లతో జనం సంతోషంగా ఉన్నారని, మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లతో పాటు 6 గ్యారెంటీ పథకాలను ప్రజలకు అందిస్తామన్నారు.

మాజీ జెడ్పీటీసీ సభ్యులు మామిడి శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రతీ నెల రూ.2,500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్, రైతులకు ఏటా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరిపంటకు రూ.500 బోనస్, ప్రతీ కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇళ్లు లేనివారికి ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షల సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇస్తామని తెలిపారు. నెలకు రూ.4 వేల పింఛన్, రూ.10 లక్షల ఆరోగ్యబీమా, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతీ మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్లు నెలకొల్పుతామని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, ఈసారి తమకు అధికారం ఇస్తే తప్పనిసరిగా హామీలను అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.

ఫరూఖ్ నగర్ మండల జెడ్పీటీసీ సభ్యులు వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి, కాంగ్రెస్ బలోపేతానికి తోడ్పడాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్య పరచాలన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని వెంకట్ రాంరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్ నగర్ మండల జెడ్పీటీసీ సభ్యులు వెంకట్ రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మమాడి శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మెన్ అనంతం, వార్డు సభ్యులు అజ్మత్ బాబా, గూడెం జంగయ్య, శ్రీనివాస్, అనంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాంగారి నర్సింలు, జాం గారి రవి, ఎరోల్ల జగన్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, కొమ్ము కృష్ణ, కావాలి కృష్ణ, గోపాల్ నాయక్, అజ్మత్ బాబా అలీ చించొడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ర్యాకల శ్రీనివాస్, రుస్తుం పెంటయ్య, శ్రీధర్ రెడ్డి,సర్దార్, గిరిధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ సరిహద్దులో పనిచేస్తున్న సిపాయిల సేవలు వెలకట్టలేనివి-జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాజర్షి షా

మెదక్, అక్టోబర్ 31:(నేటిని జం ప్రతినిధి):జాతీయ సమైక్యతా దినోత్సవంగా సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జాతీయ సమైక్యత, సమగ్రతలను కాపాడుతూ, దేశ రక్షణ కోసం తమ కుటుంబాలకు దూరంగా సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న సిపాయిల త్యాగాల ఫలితంగా మనం స్వేచ్ఛగా జీవిం చగలుగుతున్నామని అన్నారు. పబ్లిక్ సర్వీస్ లో ఉన్న మనం కూడా దేశం కోసం కొంత సమయం వెచ్చించాలని, అవసరమైతే అదనంగా పనిచేయా లని కోరారు.

మన రాజ్యాంగం సమా జంలో 18 ఏళ్ళు నిండిన అందరికి సమానంగా ఓటు హక్కు కల్పించిందని, నైతిక బాధ్యతగా ప్రతి ఒక్కరు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయి పటేల్ దార్శనికత వళ్ళ లభ్యమైన దేశ ఏకీకరణ, దేశ సమగ్రత, భద్రత, ఐకమత్యానికి అంకితమవుతాయని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఓటు వేస్తానని ఉద్యోగస్తులలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ,యునస్, బలరాం, వివి ధ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ పథకం ప్రస్తుతం దేశంలో జల్ జీవన్ మిశన్ రూపాన్ని తీసుకొంది

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న గుజరాత్ లోని మెహ్ సాణా లో దాదాపు గా 5,800 కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్టుల ను ప్రారంభించడం, దేశ ప్రజల కు అంకితం చేయడం తో పాటు గా శంకుస్థాపన కూడా వేశారు. ఈ ప్రాజెక్టుల లో రైలు, రోడ్డు, త్రాగునీరు మరియు సాగు నీటి పారుదల వంటి అనేక రంగాల కు చెందిన ప్రాజెక్టులు ఉన్నాయి.

జన సభ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, అక్టోబరు 30 వ తేదీ మరియు 31 వ తేదీ ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రేరణ ను అందిస్తున్నాయని, వాటిలో అక్టోబరు 30 వ తేదీ న గోవింద్ గురు జీ యొక్క వర్ధంతి ఉండగా, అక్టోబరు 31 వ తేదీ న ర్ దార్ పటేల్ గారి జయంతి ఉంది అన్నారు. "మన తరం ప్రపంచం లో అతి పెద్దదైన విగ్రహం 'ది స్టాట్యూ ఆఫ్ యూనిటీ' ని నిర్మించడం ద్వారా సర్ దార్ సాహబ్ కు శ్రద్ధాంజలి ని చాటుకొంది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. స్వాతంత్ర్య భారతదేశం లో ఆదివాసి సమాజం అందించిన తోడ్పాటు కు మరియు ఆదివాసి సమాజం ఒడిగట్టిన త్యాగాని కి ప్రతీక గా గోవింద్ గురు జీ యొక్క జీవనం నిలచింది అని ఆయన ప్రస్తావించారు. గత కొన్ని సంవత్సరాల లో ప్రభుత్వం మాన్ గఢ్ ధామ్ యొక్క ప్రాముఖ్యాన్ని జాతీయ స్థాయి లో ప్రతిష్ఠించింది అని ఆయన చెప్తూ, ఈ కార్యాని కి గాను తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అంతకు ముందు ప్రధాన మంత్రి అంబాజీ ఆలయం లో దైవ దర్శనం మరియు పూజ కార్యక్రమాల లో తాను పాలుపంచుకొన్న విషయాన్ని ప్రస్తావించి, అంబాజీ దేవి ని ఆశీస్సులకై వేడుకొనే అవకాశం తనకు లభించినందుకు కృతజ్ఞత ను వ్యక్తం చేశారు. గబ్బర్ పర్వతం యొక్క అభివృద్ధి పనుల ను చేపట్టి, ఆ పర్వతం యొక్క వైభవాన్ని వృద్ధి చెందింప చేసేందుకు జరుగుతున్న కార్యాల ను ఆయన ప్రశంసించారు. ఈ రోజు న చేపట్టిన ప్రాజెక్టుల ను గురించి ఆయన మాట్లాడుతూ, మాత ఆశీస్సుల తో సుమారు 6,000 కోట్ల రూపాయల విలువ కలిగిన ప్రాజెక్టుల కు శంకుస్థాపన మరియు ప్రారంభం జరిగాయన్నారు. ఈ ప్రాజెక్టు లు ఆ ప్రాంతం లో కనెక్టివిటీ ని మరింత మెరుగు పరచి, అక్కడి రైతుల కు మేలు చేస్తాయి అని ఆయన వివరించారు. "ఈ ప్రాజెక్టు ల వల్ల మెహ్ సాణా, పాటన్, బనాస్ కాంతా, సాబర్ కాంతా, మహిసాగర్, అహమదాబాద్, ఇంకా గాంధీనగర్ ల చుట్టుప్రక్కల జిల్లాల కు కూడా ప్రయోజనం అందుతుంది" అని ఆయన చెప్పారు. ఈ రోజు న చేపడుతున్న ప్రాజెక్టుల కు గాను గుజరాత్ ప్రజల కు ఆయన అభినందనల ను తెలియ జేశారు.

"భారతదేశం యొక్క అభివృద్ధి గాథ ప్రపంచవ్యాప్తం గా చర్చనీయాంశం గా మారిపోయింది" అని ప్రధాన మంత్రి అన్నారు. చంద్ర గ్రహం దక్షిణ ధ్రువం లో చంద్రయాన్ దిగడం గురించి మరియు జి20 కి భారతదేశం అధ్యక్షత విజయవంతం కావడాన్ని గురించి కూడా ప్రధాన మంత్రి ప్రస్తావించారు. భారతదేశం యొక్క ప్రతిష్ఠ పెరిగినందుకు ఇవ్వవలసిన ఖ్యాతి ని ప్రజల యొక్క శక్తి కే ఇవ్వాలి అని ఆయన అన్నారు. దేశం లో చోటుచేసుకొంటున్న సమగ్ర అభివృద్ధి ని గురించి ఆయన ప్రముఖం గా ప్రకటిస్తూ, ఈ సందర్భం లో జల సంరక్షణ, సాగు నీటి పారుదల మరియు త్రాగునీటి కోసం తీసుకొన్న చర్యల ను ప్రస్తావించారు. రహదారులు కావచ్చు, రైలు మార్గాలు కావచ్చు లేదా విమానాశ్రయాలు కావచ్చు.. అన్ని రంగాల లో ఇదివరకు ఎరుగని స్థాయి లో పెట్టుబడులు చోటు చేసుకొంటున్న సంగతి ని గురించి శ్రీ నరేంద్ర మోదీ చెప్తూ, ఆ పెట్టుబడులు భారతదేశం లో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి కి దోహదపడతాయని స్పష్టంచేశారు.

గుజరాత్ లో ప్రజలు ప్రస్తుతం దేశం లోని మిగతా ప్రాంతాల లో జరుగుతున్న అభివృద్ధి పనుల ను ఇప్పటికే కనులారా కాంచారు అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. "మోదీ ఏ సంకల్పాన్ని తీసుకొన్నా సరే దాని ని పూర్తి చేస్తారు"ని ప్రధాన మంత్రి అన్నారు. శరవేగం గా జరుగుతున్న అభివృద్ధి తాలూకు ఖ్యాతి ని గుజరాత్ ప్రజలు ఎన్నుకొన్న స్థిరమైన ప్రభుత్వానికే ఆయన కట్టబెడుతూ, దీని ద్వారా ఉత్తర గుజరాత్ సహా పూర్తి రాష్ట్రం ప్రయోజనాల ను అందుకొంది అన్నారు.

త్రాగు నీటి ఎద్దడి మరియు సేద్యానికై సాగునీటిపారుదల కు కొరత ల కారణం గా ఉత్తర గుజరాత్ అంతటా జీవనం కఠినం గా మారిన సంగతి ని ప్రధాన మంత్రి గుర్తు కు తీసుకు వస్తూ, ఒక్క పాడి వ్యాపారాన్నే తీసుకొంటే అది ఎన్నో కష్టనష్టాల ను ఎదుర్కోవలసి వచ్చిందన్నారు. రైతులు ఏటా ఒక పంట ను మాత్రమే సాగు చేసే, అది కూడాను ఒక కచ్చితత్వానికి వీలు ఉండని స్థితి లో ఉండే వారు అని ఆయన వివరించారు. ఈ ప్రాంతాని కి జవసత్వాల ను తిరిగి అందించేందుకు ఇక్కడ నీటి సరఫరా కోసం మరియు నీటి పారుదల సౌకర్యాల కోసం చేపట్టిన పనుల ను గురించి తెలియజేశారు. "మేం ఉత్తర గుజరాత్ లో వ్యవసాయ రంగం తో పాటు పారిశ్రామిక రంగాన్ని కూడాను అభివృద్ధి చేసేందుకు పాటుపడ్డాం" అని ఆయన అన్నారు. ఉత్తర గుజరాత్ లో ప్రజల కు సాధ్యమైనంత అధిక సంపాదన కు క్రొత్త క్రొత్త మార్గాల ను సృష్టించాలి అన్నదే ప్రభుత్వం ధ్యేయం అని ఆయన అన్నారు. గుజరాత్ యొక్క అభివృద్ధి కి గాను నర్మద మరియు మాహీ నదుల జలాల ను ఉపయోగించే సుజలాం-సఫలాం పథకం గురించి ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు. గరిష్ఠ లాభాల కు పూచీ పడేటట్లు గా సాబర్ మతీ మీద 6 ఆనకట్టల ను నిర్మించడం జరుగుతోంది అని శ్రీ నరేంద్ర మోదీ వెల్లడించారు. "వీటిలో ఒక ఆనకట్ట ను ఈ రోజు న ప్రారంభించడమైంది. దీని ద్వారా మన రైతుల కు మరియు డజన్ ల కొద్దీ గ్రామాల కు చాలా లాభం చేకూరుతుంది" అని ఆయన అన్నారు.

ఈ సాగు నీటిపారుదల ప్రాజెక్టుల కారణం గా గత 20-22 సంవత్సరాల లో ఉత్తర గుజరాత్ లో సేద్యపు నీటిపారుదల యొక్క పరిధి ఇంతలంతలు గా వృద్ధి చెందింది అని ప్రధాన మంత్రి చెప్పారు. ప్రభుత్వం అందుబాటు లోకి తీసుకు వచ్చినటువంటి సూక్ష్మ సేద్యం సంబంధి నూతన సాంకేతికత ను ఉత్తర గుజరాత్ రైతులు ఇట్టే అందిపుచ్చుకున్నారు అని ఆయన తెలియజేస్తూ, ఈ నవీన సాంకేతికత ను బనాస్ కాంతా లో 70 శాతం క్షేత్రం లోని రైతులు ఉపయోగించుకొంటున్నందుకు సంతోషాన్ని వెలిబుచ్చారు. ''రైతులు ఇక గోధుమలు, ఆముదం, వేరుశనగ, ఇంకా సెనగ వంటి అనేక పంటల తో పాటు గా సోంపు, జీలకర్ర తదితర మసాలా దినుసుల పంటల ను ఎన్నింటినో సాగు చేయగలుగుతారు" అని ఆయన వివరించారు. దేశం లో సాగయ్యే ఇసాబ్ గోల్ శుద్ధి లో 90 శాతం గుజరాత్ లోనే అవుతోంది, ఇది గుజరాత్ కు ఒక విశిష్టమైన గుర్తింపు ను ప్రసాదిస్తోంది అని ప్రధాన మంత్రి తెలిపారు. వ్యావసాయిక ఉత్పాదన అంతకంతకు పెరుగుతోంది అని కూడా ఆయన వివరిస్తూ, బంగాళా దుంపలు, కేరట్, మామిడి, ఉసిరి, దానిమ్మ, జామ మరియు నిమ్మ పండ్ల సాగు ను గురించి ప్రస్తావించారు. డీసా ను బంగాళా దుంపల సాగు కు ఒక సేంద్రియ వ్యావసాయక కేంద్రం గా తీర్చిదిద్దేందుకు ప్రయాన లు జరుగుతున్నాయి అని ఆయన అన్నారు. బనాస్ కాంతా లో బంగాళా దుంపల ప్రాసెసింగ్ కోసం ఒక భారీ ప్లాంటు ను ఏర్పాటు చేసే అంశాన్ని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. మెహ్ సాణా లో ఎగ్రో ఫూడ్ పార్క్ నిర్మాణం జరిగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. బనాస్ కాంతా లో ఇదేవిధమైనటువంటి మెగా ఫూడ్ పార్కు ను నిర్మించడాని కి తగిన సన్నాహాలు జరుగుతున్నాయి అని ఆయన అన్నారు.

ప్రతి ఇంటి కి నీటి ని సరఫరా చేయడం గురించి శ్రీ నరేంద్ర మోదీ చెప్తూ, గుజరాత్ లో మొదలు పెట్టిన జల సంరక్షణ పథకం ప్రస్తుతం యావత్తు దేశం కోసం జల్ జీవన్ మిశన్ రూపాన్ని సంతరించుకొంది అన్నారు. "గుజరాత్ లో మాదిరి, హర్ ఘర్ జల్ అభియాన్ దేశం లో కోట్ల కొద్దీ ప్రజల జీవనాల లో మార్పు ను తీసుకు వస్తోంది'' అని ఆయన అన్నారు.

పశుసంవర్ధక, పాడిపరిశ్రమ ప్రగతి వల్ల అత్యధికంగా లబ్ధి పొందుతున్నది మహిళలేనని ప్రధానీ మోదీ పేర్కొన్నారు. ఇక ఉత్తర గుజరాత్‌లో కొన్నేళ్లుగా వందలాది కొత్త పశు వైద్యశాలలు నిర్మించిన నేపథ్యంలో జంతు ఆరోగ్యం, శ్రేయస్సు చక్కగా ఉంటాయన్నారు. తద్వారా పాల దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో గత రెండు దశాబ్దాల్లో 800కుపైగా కొత్త గ్రామీణ పాల సహకార సంఘాలు కూడా ఏర్పాటైనట్లు ప్రధాని గుర్తుచేశారు. ఫలితంగా ''బనస్ డెయిరీ, దూద్ సాగర్ లేదా సబర్ డెయిరీ వంటివి కూడా మునుపెన్నడూ లేనిరీతిలో విస్తరించబడుతున్నాయి. అంతేకాకుండా ఇతరత్రా రైతు ఉత్పత్తులకూ ఇవి భారీ ప్రాసెసింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి'' అన్నారు. పశుగణాన్ని వ్యాధుల ముప్పునుంచి కాపాడేందుకు ప్రభుత్వం భారీ ఎత్తున ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టిందని ప్రధాని చెప్పారు. ఇందుకోసం రూ.15 వేల కోట్లు వెచ్చిస్తున్నదని వెల్లడించారు. ఈ ప్రాంత పశుపోషకులు టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ పశుగణానికి టీకాలు వేయించాలని ఆయన కోరారు. గోబర్-ధన్ కింద ఆవు పేడతో బయోగ్యాస్, బయో 'సీఎన్జీ' తయారీ కోసం అనేక ప్లాంట్లు ఏర్పాటు చేయడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.'

ఉత్తర గుజరాత్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ విస్తరణ గురించి మాట్లాడుతూ- ఉపాధి అవకాశాలు, ప్రజల ఆదాయం పెంచిన మండల్-బేచరాజీ మోటారు వాహన కూడలి అభివృద్ధిని శ్రీ మోదీ ప్రస్తావించారు. "ఇక్కడి పరిశ్రమల ఆదాయం కేవలం పదేళ్లలోనే రెట్టింపైంది. మెహసానాలో ఆహార తయారీలోపాటు ఔషధ, ఇంజనీరింగ్ పరిశ్రమలు కూడా పురోగమించాయి. బనస్కాంత, సబర్‌కాంత జిల్లాల్లో పింగాణీ ఆధారిత పరిశ్రమలు వచ్చాయి" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ?5000 కోట్లకుపైగా విలువైన రైల్వే ప్రాజెక్టుల ప్రారంభం గురించి కూడా ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. మెహసానా, అహ్మదాబాద్ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ గురించి వివరించారు. పిపవావ్, పోర్‌బందర్, జామ్‌నగర్ వంటి ప్రధాన ఓడరేవులతో ఉత్తర గుజరాత్ సంధానాన్ని ఈ కారిడార్ మరింత ముందుకు తీసుకెళ్తుందని ఆయన నొక్కిచెప్పారు. ఇది ఉత్తర గుజరాత్‌లో రవాణా, నిల్వ సంబంధిత రంగాలను కూడా బలోపేతం చేయగలదని పేర్కొన్నారు.

దేశంలో హరిత ఉదజని, సౌరశక్తి ఉత్పత్తి గురించి చెబుతూ- ఇందులో భాగంగా రాష్ట్రంలోని పటాన్‌లోగల సౌరశక్తి పార్కుతోపాటు బనస్కాంతలో సౌరశక్తితో 24 గంటల విద్యుత్ సరఫరాగల మోఢేరా గ్రామాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. "ఇవాళ భవనాల పైకప్పు మీద సౌరశక్తి ఫలకాల ఏర్పాటు కోసం ప్రభుత్వం మీకు గరిష్ఠంగా ఆర్థిక సహాయం చేస్తోంది. తద్వారా ప్రతి కుటుంబానికీ నెలనెలా విద్యుత్ బిల్లును తగ్గించడమే మా లక్ష్యం'' అన్నారు. గడచిన తొమ్మిదేళ్లలో దాదాపు 2,500 కిలోమీటర్ల మేర తూర్పు-పశ్చిమ సరకు రవాణా కారిడార్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. దీనివల్ల ప్రయాణికుల రైళ్లతోపాటు సరకు రవాణా రైళ్ల ప్రయాణ సమయం తగ్గిందన్నారు. పాలన్‌పూర్ నుంచి హర్యానాలోని రేవారీకి రైళ్ల ద్వారా పాల రవాణాను కూడా ఆయన ప్రస్తావించారు. "ఇక్కడ చేపట్టిన కటోసన్ రోడ్-బేచరాజీ రైలు మార్గం, విరాంగమ్-సమఖాయలి మార్గం డబ్లింగ్ పనులతో అనుసంధానం బలోపేతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

గుజరాత్‌లో పర్యాటక రంగ విస్తరణకుగల సామర్థ్యాన్ని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ- ప్రపంచ ప్రసిద్ధ మైన కచ్ రాణ్ ఉత్సవాల గురించి వివరించారు. అలాగే ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యాటక ప్రాంతంగా ఇటీవలే గుర్తింపు పొందిన కచ్‌లోని ధోర్డో గ్రామం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఉత్తర గుజరాత్ దేశంలోనే ప్రధాన పర్యాటక కూడలిగా మారగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. మరోవైపు కీలక పర్యాటక కేంద్రంగా మారుతున్న నడబెట్ ఉదాహరిస్తూ, భారీ పర్యాటక కూడలిగా రూపొందుతున్న ధరోయి ప్రాంతం గురించి కూడా ప్రస్తావించారు. మెహసానాలోని మోఢేరా గ్రామంలోగల సూర్య దేవాలయం, నగరం నడిబొడ్డునగల నిరంతరం ప్రజ్వలించే అఖండ జ్యోతి, వాద్‌నగర్‌లోని కీర్తి తోరణం, ఇతర సంప్రదాయ, అధ్యాత్మిక ప్రదేశాలను కూడా శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రాచీన నాగరికత ఆనవాళ్లను వెల్లడించే తవ్వకాలు సాగుతున్న వాద్‌నగర్ యావత్ ప్రపంచానికి పర్యాటక కేంద్రంగా మారిందన్నారు. "కేంద్ర ప్రభుత్వం ఇక్కడ వారసత్వ సర్క్యూట్ కింద ?1,000 కోట్లతో అనేక ప్రాంతాలను అభివృద్ధి చేసింది'' అంటూ ఏటా సగటున 3 లక్షల మందికిపైగా పర్యాటకులు సందర్శించే 'రాణీగారి బావి'ని ప్రధాని ఉదాహరించారు. చివరగా- "మన వారసత్వాన్ని అభివృద్ధితో ముడిపెట్టే అద్భుత కృషి నేడు దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. ఇది వికసిత భారతం నిర్మాణంపై మా సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుంది" అని ప్రధాని తన ప్రసంగం ముగించారు.

ఈ కార్యక్రమంలో గుజరాత్ ప్రధానమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, కేంద్ర సహాయమంత్రి శ్రీమతి దర్శనా జర్దోష్, స్థానిక ఎంపీ శ్రీ సి.ఆర్.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతోపాటు మరికొన్నిటికి శంకుస్థాపన కూడా చేశారు. ఈ మేరకు జాతికి అంకితం చేసిన వాటిలో రైల్వే, రహదారులు, తాగునీరు, నీటిపారుదల తదితర రంగాల పథకాలున్నాయి. ఈ మేరకు పశ్చిమ భారత ప్రత్యేక కారిడార్ (డబ్ల్యుడి ఎఫ్‌సి)లో భాగమైన న్యూభాండూ-న్యూ సనంద్(ఎన్) విభాగం; విరాంగం-సమాఖియలి రైలు మార్గం డబ్లింగ్; కటోసన్ రోడ్-బెచ్రాజీ- మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్ సైడింగ్) రైలు ప్రాజెక్టు; మెహసానా, గాంధీనగర్ జిల్లాల్లోగల విజాపూర్, మాన్సా తాలూకాలోని వివిధ గ్రామ చెరువుల పునర్నిర్మాణ ప్రాజెక్ట్; మెహసానా జిల్లాలో సబర్మతి నదిపై వలసనా బ్యారేజీ; పాలన్‌పూర్, బనస్కాంతలో తాగునీరందించే రెండు పథకాలు; ధరోయ్ ఆనకట్ట ఆధారిత పాలన్‌పూర్ జీవనాడి ప్రాజెక్ట్-హెడ్ వర్క్ సహా 80 ఎంఎల్‌డి సామర్థ్యంగల నీటి శుద్ధి ప్లాంటు తదితరాలున్నాయి.

ఇక ప్రధానమంత్రి శంకుస్థాపన చేసినవాటిలో మహిసాగర్ జిల్లా సంత్రంపూర్ తాలూకాలో నీటిపారుదల సౌకర్యాల కల్పన ప్రాజెక్ట్; నరోడా-దేహగాం-హర్సోల్-ధన్సురా రోడ్, సబర్‌కాంత విస్తరణ, బలోపేతం; గాంధీనగర్ జిల్లాలో కలోల్ నగరపాలిక మురుగునీటి పారుదల, మురుగుశుద్ధి నిర్వహణ ప్రాజెక్ట్; సిద్ధపూర్ (పటాన్), పాలన్‌పూర్ (బనస్కాంత), బయాడ్ (ఆరావళి), వాద్‌నగర్ (మెహసానా)లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు ప్రాజెక్టులున్నాయి.

# సైబర్ దొంగల చేతికి చిక్కిన ఐసీఎంఆర్ వద్ద ఉన్న భారతీయుల వివరాలు

## -డాటాతో ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ దోపిడీలు జరుగొచ్చు?

న్యూఢిల్లీ, అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూ స్): ఆధార్‌లో నిక్షిప్తమైన భారతీయుల బయోమెట్రిక్ వివరాలు సురక్షితం కావన్న నిపుణుల ఆందోళన మరోమారు నిజమని నిరూపణ అయింది. తమ వద్ద 81.5 కోట్ల మంది భారతీయుల బయోమెట్రిక్ వివరాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయంటూ డార్క్‌వెబ్‌లో వెలువడిన ఒక ప్రకటన ఒక్కసారిగా ప్రభుత్వ యంత్రాంగాన్ని గ్రిభ్రాంతికి గురిచేసింది. దీనిని దేశంలోనేఅత్యంత భారీ డాటా చోరీగా పేర్కొంటున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) వద్ద ఉన్న భారతీయుల వివరాలు సైబర్ దొంగల చేతికి చిక్కినట్టు తెలుస్తున్నది.ఈ ఘటనపై ఐసీఎంఆర్ నుంచి ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు చేసేందుకు సీబీఐ సిద్ధంగా ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. తమ వద్ద 81.5 కోట్ల మంది భారతీయులకు సంబంధించిన ఆధార్, పాస్‌పోర్ట్ సమాచారం ఉన్నట్టు ఓ అజ్ఞాత వ్యక్తి డార్క్‌వెబ్‌లో ప్రకటించాడు. దీనికి సంబంధించి కొన్ని పేర్లు, వారి ఫోన్ నంబర్లు, అడ్రస్‌లతో సహా వెల్లడించాడు. ఈ వివరాలు ఐసీఎంఆర్ వద్దనున్న డాటాతో సరిపోలినట్టు అధికారులు పేర్కొన్నారు.ఐసీఎంఆర్ మీద గత ఫిబ్రవరి నుంచే సైబర్ దాడులు జరుగుతున్నాయి. గత ఎనిమిది నెలల్లో సుమారు ఆరువేల సార్లు ఐసీఎంఆర్ సర్వర్లపై దాడులు జరిగినట్టు అధికారులు తెలిపారు. దీనిపై ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని కేంద్ర సంస్థలు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోయిందని, అక్కడి నుంచే డాటా చోరీ జరిగిందని అభిజ్ఞ వర్గాలు పేర్కొన్నాయి. డాటా చోరీ విషయం తెలిసిన వెంటనే వివిధ ప్రభుత్వ సంస్థలు, మంత్రిత్వశాఖలకు చెందిన ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. డాటా చోరీలో విదేశీ వ్యక్తుల హస్తమున్నట్టు అనుమానిస్తున్నారు. ప్రస్తుతానికి మరింత నష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్తున్నారు.

కొవిడ్ పరీక్షలతో ఐసీఎంఆర్‌కు చేరిన డాటా

కొవిడ్ పరీక్షలు జరిపిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆయా వైద్య సంస్థలు సేకరించిన పౌరుల వివరాలు ఐసీఎంఆర్‌కు, జాతీయ సమాచార కేంద్రానికి (ఎన్ఐసీ), కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు అందించారు. ఈ మూడు ప్రదేశాలలో ఎక్కడి నుంచి డాటా చోరీ అయిందో తెలియాల్సి ఉన్నదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. భారతీయుల డాటా చోరీ విషయాన్ని ముందుగా అమెరికాకు చెందిన సైబర్ సెక్యూరిటీ, నిఘా విభాగమైన 'రీసెక్యూరిటీ' సంస్థ బయటపెట్టింది. ఈ నెల 9న 'పీడబ్ల్యూన్0001' పేరిట ఓ అజ్ఞాత వ్యక్తి 81.5 కోట్ల మంది భారత పౌరుల ఆధార్, పాస్‌పోర్ట్ రికార్డులను 'బ్రీచ్ ఫోరమ్స్'పై పోస్ట్ చేసినట్టు రీసెక్యూరిటీ సంస్థ వెల్లడించింది.తమ వద్దనున్న డాటాకు రుజువుగా నాలుగు శాంపిల్స్‌ను కూడా సదరు అజ్ఞాత వ్యక్తి బయటపెట్టగా.. ఒక్కో శాంపిల్‌లో లక్ష మందికి సంబంధించిన 'గుర్తించదగిన వ్యక్తిగత సమాచారం (పీఐఐ)' ఉన్నట్టు చెప్తున్నారు. భారత ఆరోగ్య వ్యవస్థపై హ్యాకర్లు దాడులు చేయటం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది ఢిల్లీలోని ఎయిమ్స్‌పై సైబర్ దాడులు జరిగాయి. సర్వర్లన్నింటినీ తమ స్వాధీనంలోకి తెచ్చుకున్న హ్యాకర్లు ఔట్‌పేషెంట్ విభాగంలోని రోగుల రికార్డులన్నీ ప్రభావితం చేశారు.

డాటాతో ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ దోపిడీలు జరుగొచ్చు..

ఆధార్ వివరాలు అంత సురక్షితంగా లేవని, ఆ సమాచారాన్ని ఎవరైనా దొంగిలించవచ్చని బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్, క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ గత నెలలోనే హెచ్చరించాయి. అయితే హెచ్చరికలను కేంద్ర సంస్థలు వెంటనే తోసిపుచ్చాయి.దేశంలో బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి వ్యక్తిఆధార్‌ను దానికి అనుసంధానం చేశారు. పట్టణాలు, నగరాల్లోనే కాదు గ్రామీణులు సైతం ఎలక్ట్రానిక్స్ విధానంలో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం కూడా ఓటర్ల వివరాలకు ఆధార్‌ను అనుసంధానం చేసింది. ఇప్పటికి 94.5 కోట్ల మంది అనగా 60 శాతం మంది ఓటర్లు తమ ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధానం చేశారు. సైబర్ దొంగల వద్దనున్న భారతీయుల డాటాతో ఆన్‌లైన్‌లో బ్యాంకింగ్ దోపిడీలు, ట్యాక్స్ రిఫండ్ మోసాలు, ఇతర ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# సత్యపాల్ అధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న మంత్రి




ఖమ్మం, అక్టోబర్ 31:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరం రోటరీ నగర్ లోని గుడ్ షెపర్డ్ చర్చ్ నందు రెవ.సత్యపాల్, అధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రేయర్ నందు పాల్గొన్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్.ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గెలుపును కాంక్షిస్తూ ప్రార్ధనలు చేశారు. వారి వెంట జాన్ కాంతా రావు, ప్రవీణ్ కుమార్, క్రిష్టఫర్, ఆనంద్ బాబు, సజ్జన్ పాల్, బి.ప్రసాద్ రావు, కేజే రావు, బాబు రావు, సంజీవ్ రావు, రమేష్ పాల్, సెల్వ రాజ్, రవి కిషన్, స్టీఫెన్ పాల్, కంచర్ల దయాకర్, వేణు, రాజు, జోజి రమేశ్, వేణు వర్ధన్, జకర్య నాగుల్ మీరా, ఏళ్లంకి సుధాకర్ తదితరులు ఉన్నారు.

# గుజరాత్‌లోని కేవడియాలో జరిగిన రాష్ట్రీయ ఏకత దివస్ వేడుకలలో పాలుపంచుకొన్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న రాష్ట్రీయ ఏకత దివస్ కు సంబంధించిన కార్యక్రమాల లో పాలుపంచుకొన్నారు. సర్ దార్ పటేల్ గారి జయంతి సందర్భం లో 'స్టేట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద ప్రధాన మంత్రి శ్రద్ధాంజలి ని సమర్పించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ రాష్ట్రీయ ఏకత దివస్ కవాతు ను వీక్షించారు; ఈ కవాతు లో బిఎస్ఎఫ్, ఇంకా రాష్ట్ర పోలీసు విభాగాని కి చెందిన వేరు వేరు దళాలు పాల్గొన్నాయి. అంతేకాకుండా, సిఆర్ పిఎఫ్ కు చెందిన మహిళలు మోటారు సైకిళ్ళ పై ఆవిష్కరించిన ఒక సాహస ప్రధానమైన విన్యాసాలు, బిఎస్ఎఫ్ కు చెందిన మహిళల పైప్ బ్యాండ్ కార్యక్రమం, గుజరాత్ మహిళా పోలీసు విభాగం సమర్పించినటువంటి ఒక కార్యక్రమం, ఎన్ సిసి యొక్క ప్రత్యేక ప్రదర్శన, పాఠశాల విద్యార్థులు పాల్గొన్న బ్యాండ్ కార్యక్రమం, భారతీయ వాయు సేన సమర్పించిన ఫ్లయ్ పాస్ట్ లతో పాటు, వైబ్రంట్ విలేజెస్ లో ఆర్థిక చైతన్యాన్ని చాటే ఒక కార్యక్రమం తదితరాల ను కూడా ప్రధాన మంత్రి తిలకించారు.

జన సభ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, భారతదేశం లో యువతీ యువకులు మరియు యోధుల యొక్క ఏకత శక్తి ని రాష్ట్రీయ ఏకత దివస్ అనేది చాటిచెబుతోంది అని అభివర్ణించారు. "ఒక విధం గా ఇక్కడ బుల్లి భారతదేశాన్ని నేను చూస్తున్నాను" అని ప్రధాన మంత్రి అన్నారు. భాషలు, రాష్ట్రాలు మరియు సంప్రదాయాలు వేరైనప్పటికీ దేశం లో ప్రతి ఒక్క వ్యక్తి ఏకత తాలూకు బలమైన పాశం తో ముడిపడ్డారు అని ఆయన నొక్కి చెప్పారు. "పూస లు అనేకం ఉన్నా గానీ దండ మాత్రం ఒక్కటే, మనం భిన్నం గా ఉన్నప్పటికీ ఒక్కటి గా ఉంటున్నాం" అని ఆయన అన్నారు. ఆగస్టు లో 15 వ తేదీ ని స్వాతంత్ర్య దినం గా మరియు జనవరి లో 26 వ తేదీ ని గణతంత్ర దినం గా జరుపుకొన్నట్లే అక్టోబరు 31 వ తేదీ ని దేశవ్యాప్తం గా 'ఏకత' తాలూకు పండుగ రోజు గా పాటిస్తున్నట్లు ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. ఎర్రకోట లో జరిగే స్వాతంత్ర్య దిన ఉత్సవాలు, కర్తవ్య పథ్ లో జరిగే గణతంత్ర దిన కవాతు, మరి నర్మద మాత తీర ప్రాంతం లో గల స్టేట్యూ ఆఫ్ యూనిటీ వద్ద జరిగే రాష్ట్రీయ ఏకత దివస్ వేడుక లు.. ఈ మూడూ జాతీయ చైతన్యాని కి ప్రతీక లు అని ఆయన ప్రముఖం గా పేర్కొన్నారు. ఈ రోజు న నిర్వహించుకొంటున్న కార్యక్రమాన్ని గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఎవరైతే ఏకత నగర్ ను సందర్శిస్తారో వారు స్టేట్యూ ఆఫ్ యూనిటీ ని వీక్షించడం ఒక్కటే కాకుండా, సర్ దార్ సాహబ్ యొక్క జీవనం మరియు భారతదేశ జాతీయ అఖండత కు ఆయన అందించిన సేవల ను సైతం దర్శిస్తారు అని ప్రధాన మంత్రి అన్నారు. "స్టేట్యూ ఆఫ్ యూనిటీ అనేది ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ ఆదర్శాల కు ప్రతినిధిత్వాన్ని వహిస్తున్నది" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆ విగ్రహ నిర్మాణం లో పౌరులు అందించిన తోడ్పాటుల ను గురించి ఆయన చెప్తూ, రైతులు ఈ కార్యం కోసం వారి ఉపకరణాల ను విరాళం గా ఇచ్చిన ఉదాహరణ ను ప్రస్తావించారు. వాల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం కోసం భారతదేశం లో వివిధ ప్రాంతాల నుండి మట్టి ని తీసుకు వచ్చి, ఆ మట్టి భాగాల ను ఒక చోట కలపడం జరిగింది అని కూడా ఆయన అన్నారు. దేశవ్యాప్తం గా 'రన్ ఫర్ యూనిటీ' మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాల లో పాలుపంచుకోవడం ద్వారా రాష్ట్రీయ ఏకత దివస్ వేడుకల లో కోట్ల కొద్దీ పౌరులు జతపడ్డారు అని ప్రధాన మంత్రి తెలియ జేశారు. "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ భావన ను ఒక పండుగ లాగా జరుపుకోవడం కోసం ముందుకు వచ్చిన 140 కోట్ల మంది పౌరుల లో సర్ దార్ సాహబ్ యొక్క ఆదర్శాలు మూర్తీభవించాయి" అని ప్రధాన మంత్రి అన్నారు. సర్ దార్ పటేల్ గారి కి ప్రధాన మంత్రి శ్రద్ధాంజలి ని సమర్పించి, పౌరుల కు రాష్ట్రీయ ఏకత దివస్ సందర్భం లో అభినందనల ను తెలియ జేశారు.

రాబోయే 25 సంవత్సరాల కాలం లో భారతదేశం సమృద్ధమైనటువంటి మరియు అభివృద్ధి చెందినటువంటి దేశం గా మారనున్న తరుణం లో ఈ కాలం అత్యంత ముఖ్యమైంది అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. స్వాతంత్ర్యం సాధన కు పూర్వం 25 సంవత్సరాలు ఏ విధం గా గడిచాయో, అదే విధమైనటువంటి సమర్పణ భావం ప్రస్తుతం అవసరం అని ఆయన పిలుపు ను ఇచ్చారు. ప్రపంచం దృష్టి లో భారతదేశం యొక్క ప్రతిష్ఠ పెరుగుతోందని ఆయన అన్నారు. "మనం అతి పెద్దదైన ప్రజాస్వామ్య ప్రతిష్ఠ ను ఒక సరిక్రొత్త శిఖర స్థాయి కి తీసుకుపోతున్నామన్న సంగతి గర్వపడేటటువంటి అంశం" అని ఆయన అన్నారు. భద్రత లో, ఆర్థిక వ్యవస్థ లో, విజ్ఞాన శాస్త్రం లో, దేశీయ రక్షణ రంగ సంబంధి ఉత్పత్తి లో, భారతదేశం ఒక పటిష్ఠమైన స్థితి లో ఉంది" అని ఆయన ప్రస్తావిస్తూ, ప్రపంచం లోని కీలక కంపెనీల లో నాయకత్వ స్థానం లో, క్రీడా రంగం లో అగ్ర స్థానాల లో భారతీయులు నిలబడుతున్న సంగతి ని ఆయన ప్రస్తావించారు.

అదే పని గా ముందు కు అడుగుల ను వేస్తూ, బానిస మనస్తత్వాన్ని వదలి వేయాలి అనే ప్రతిజ్ఞ ను గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తావిస్తూ, "భారతదేశం అభివృద్ధి పయనం లో పయనిస్తూనే భారతదేశం యొక్క వారసత్వాన్ని కాపాడుకొంటోంది'' అన్నారు. నౌకాదళాని కి చెందిన ధ్వజం లో వలసవాద కాలానికి చెందిన చిహ్నాన్ని తొలగించడం, వలస హయాం కు చెందిన అనవసరమైన చట్టాల కు స్వస్తి పలకడం, ఐపిసి స్థానం లో క్రొత్త మార్పు ను ప్రవేశ పెట్టడం, మరి అలాగే ఇండియా గేట్ వద్ద వలసవాద ప్రతినిధుల స్థానం లో నేతాజీ ప్రతిమ ను ఏర్పాటు చేయడం వంటి విషయాల ను ప్రధాన మంత్రి వివరించారు.

"ఇవాళ, భారతదేశం చేరుకోలేని అటువంటి లక్ష్యమంటూ ఏదీ లేదు" అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. సబ్ కా ప్రయాస్ శక్తి ని గురించి ఆయన ప్రముఖం గా ప్రకటిస్తూ, 370 వ అధికరణం రద్దు ప్రసక్తి ని తీసుకువచ్చారు. ప్రస్తుతం కశ్మీర్ కు మరియు దేశం లోని మిగతా ప్రాంతాల కు మధ్య నిలచిన 370 వ అధికరణం అనే ఒక గోడ కూలిపోయింది, మరి ఇది సర్ దార్ సాహబ్ ఎక్కడ ఉన్నప్పటికీ ఆయన కు సంతోషాన్ని ఇచ్చి ఉంటుంది అని ప్రధాన మంత్రి అన్నారు.

దీర్ఘకాలం గా పరిష్కారం కాకుండా ఉన్నటువంటి అంశాల ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, సర్ దార్ సరోవర్ ఆనకట్ట పనులు 5-6 దశాబ్దాలు గా స్తంభించిపోగా, వాటిని గత కొన్నేళ్ళ లో పూర్తి చేయడమైందన్నారు. కేవడియా-ఏక్ తా నగర్ యొక్క పరివర్తన అనేది సంకల్ప్ సే సిద్ధి తాలూకు ఒక ఉదాహరణ గా ఉంది అని ఆయన ప్రస్తావించారు. ఇవాళ ఏకత నగర్ ను ఒక గ్లోబల్ గ్రీన్ సిటీ గా గుర్తిస్తున్నారు అని ఆయన అన్నారు. అనేక పర్యటన ప్రధానమైన ఆకర్షణ కేంద్రాల కు తోడు గత 6 నెలల లో ఏకత నగర్ లో ఒక లక్ష ఏభై వేల మొక్కల ను నాటడం జరిగింది అని ప్రధాన మంత్రి తెలిపారు. ఆ ప్రాంతం లో ఇప్పటికే సౌర విద్యుత్తు ఉత్పాదన మరియు సిటీ గ్యాస్ వితరణ వేళ్ళూనుకొన్నాయని, మరి ప్రస్తుతం హెరిటేజ్ ట్రేన్ ను కూడా ఏకత నగర్ కు జోడించడం జరుగుతుంది అని వివరించారు. గడచిన 5 సంవత్సరాల లో ఒక కోటి ఏభై లక్షల మంది కి పైగా పర్యటకులు వచ్చారని, తద్వారా స్థానిక ఆదివాసి సముదాయాల కు ఉపాధి అవకాశాలు అందివచ్చాయి అని ఆయన అన్నారు.

"ప్రస్తుతం యావత్తు ప్రపంచం భారతదేశం యొక్క మొక్కవోని సంకల్పం మరియు ఇక్కడి ప్రజల సాహసాన్ని, సౌమ్యత ను అంగీకరిస్తోంది" అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం ప్రపంచం భారతదతేశం యొక్క ఈ సంకల్పాన్నుండి ప్రేరణ ను పొందుతోంది అని ఆయన అన్నారు. కొన్ని ధోరణుల కు వ్యతిరేకం గా సైతం నడచుకోవలసి ఉంది అంటూ ఆయన హెచ్చరిక ను చేశారు. ప్రస్తుతం ప్రపంచం లో భౌగోళికవరమైనటువంటి, రాజకీయపరమైనటువంటి అస్థిరత్వం తలెత్తడాన్ని గురించి ప్రధాన మంత్రి చెప్తూ, కోవిడ్ మహమ్మారి అనంతరం అనేక దేశాల ఆర్థిక వ్యవస్థ లు అతలాకుతలం అయ్యాయి, ఆయా దేశాల లో ధరల పెరుగుదల మరియు నిరుద్యోగం గత 30-40 సంవత్సరాల కాలం లో శిఖర స్థాయిల కు చేరాయి అని తెలిపారు. ఈ స్థితి లో భారతదేశం సరిక్రొత్త రికార్డుల ను నెలకొల్పడంతో పాటు సంకల్పాల ను నెరవేర్చుకొంటూ నిరంతరం గా ముందుకు సాగుతోంది అని స్పష్టం చేశారు. గడచిన తొమ్మిది సంవత్సరాల లో ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలు మరియు అమలు చేసిన విధానాల సకారాకత్మక ప్రభావాన్ని ప్రస్తుతం గమనించవచ్చును అని ప్రధాన మంత్రి అన్నారు. గత 5 సంవత్సరాల లో 13.5 కోట్ల మంది కి పైగా భారతీయులు పేదరికం నుండి బయటకు వచ్చారు అని ఆయన తెలిపారు. దేశం లో స్థిరత్వాన్ని నిలబెట్టాలి అంటూ పౌరుల కు ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు. భారతదేశాన్ని అభివృద్ధి మార్గం లోకి ప్రవేశపెట్టిన 140 కోట్ల మంది పౌరుల కృషి వృథా పోకూడదు అని ప్రధాన మంత్రి అన్నారు. "మనం భవిష్యత్తు పై దృష్టి పెడుతూనే, జాతీయ లక్ష్యాల ను పూర్తి చేయాలన్న మన సంకల్పాన్ని నెరవేర్చుకొంటూ ఉండాలి" అని ఆయన చెప్పారు.

దేశం లో భద్రత కై ఉక్కు మనిషి సర్ దార్ సాహబ్ గంభీరమైన ఆలోచనలను చేసే వారు అని ప్రధాన మంత్రి చెప్తూ, ఈ విషయం లో గడచిన 9 ఏళ్ళ లో తీసుకొన్న చర్యల ను గురించి, మరి అలాగే వినాశకర శక్తులు ఇదివరకు సాధించినటువంటి సఫలతల ను వారికి దూరం చేస్తూ రా సవాళ్ళ ను ఏ విధం గా బలంగా తిప్పి కొడుతోందీ ఆయన తెలియజేశారు. దేశ ప్రజల ఏకత్వం పై జరుగుతున్న దాడుల పట్ల జాగరూకులై ఉండవలసిన అవసరం ఉందని కూడా ఆయన స్పష్టంచేశారు.

భారతదేశం యొక్క అభివృద్ధి యాత్ర లో అతి ముఖ్య అవరోధం తృప్తి పరచేటటువంటి రాజకీయాలే అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. గడచిన అనేక దశాబ్దాల లో ఇది స్పష్టం అయింది. తుష్టి ప్రధానమైన రాజకీయాల లో మునిగి తేలే వారు ఉగ్రవాదం పట్ల మరియు మానవీయత కు శత్రువు గా నిలచే వారి పట్ల శీతకన్ను వేస్తున్నారు అని ఆయన అన్నారు. ఆ తరహా ఆలోచన విధానం దేశ ఏకత్వాన్ని అపాయం లో పడవేస్తుంది అంటూ ఆయన హెచ్చరించారు.

త్వరలో జరుగనున్న మరియు రాబోయే కాలం లో జరుగనున్న ఎన్నికల ను గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ సకారాత్మకమైన రాజకీయాల ను గురించి ఎంత మాత్రం పట్టించుకోనటువంటి మరియు జాతి వ్యతిరేక కార్యకలాపాల లోను, సంఘ వ్యతిరేక కార్యకలాపాల లోను ప్రమేయం పెట్టుకొంటున్న వర్గం తో అప్రమత్తం గా మెలగాలని జాగ్రత చెప్పారు. "అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ఆవిష్కరించాలి అనే లక్ష్యాన్ని సాధించడం కోసం దేశ ఏకత ను కాపాడేందుకు మనం మన కృషి ని నిరంతరం గా కొనసాగించవలసి ఉంది. మనం ఏ రంగం లో ఉన్నప్పటికీ, ఆ రంగం లో వంద శాతం తోడ్పాటు ను ఇచ్చి తీరాలి. రాబోయే తరాల కు మెరుగైన భవిష్యత్తు ను ప్రసాదించాలి అంటే ఇది ఒక్కటే ఉపాయం" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

సర్ దార్ పటేల్ గారి ని గురించి మైగవ్ లో ఒక జాతీయ పోటీ ని నిర్వహిస్తున్న విషయాన్ని గురించి కూడా శ్రీ నరేంద్ర మోదీ వెల్లడించారు.

ప్రస్తుత భారతదేశం విశ్వాసం ఉట్టిపడుతున్నటువంటి ప్రతి ఒక్క పౌరుడి తో కూడిన 'న్యూ ఇండియా' గా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ విశ్వాసం ఇదే విధం గా కొనసాగే, మరి ఏకత్వ భావన ను కూడా ఇదే మాదిరి గా ఉండేటట్లు చూడాలి అని ఆయన నొక్కి పలికారు. సర్ దార్ పటేల్ గారి కి పౌరుల పక్షాన ప్రధాన మంత్రి వినమ్రత శ్రద్ధాంజలి ని సమర్పిసస్తూ, తన ప్రసంగాన్ని ముగించారు. రాష్ట్రీయ ఏకత దివస్ సందర్భం లో తన శుభాకాంక్షల ను కూడా ప్రధాన మంత్రి వ్యక్తం చేశారు.

దేశ ఏకత, అఖండత మరియు భద్రత లను పరిరక్షిస్తూ మరి దృఢ భావన ను పెంచాలనే ఉద్దేశ్యం తో ప్రధాన మంత్రి తన దూరదర్శి నాయకత్వం లో సర్ దార్ వల్లభ్ భాయి పటేల్ గారి జయంతి ని రాష్ట్రీయ ఏకత దివస్ గా పాటించాలన్న నిర్ణయాన్ని తీసుకోవడమైంది.

# బీసీకి దమ్ము ఉంటే నియోజకవర్గాన్ని విడవద్దు

## -పార్టీ ఏదైనా ఎమ్మెల్యే బీఫారం ముఖ్యం గెలుపే సమాధానం
## -26 జిల్లాలో బీసీల రాజ్యాధికార రథయాత్ర బహిరంగ సభలు
## -జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్

విశాఖపట్నం అక్టోబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన నాయకులు చట్టసభల్లో రిజర్వేషన్ లేక అనేక అవమానాలకి ఆర్థిక నష్టానికి గురవుతున్న వైనంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ బీసీ ఫైర్ బ్రాండ్ లీడర్ కర్రి వేణుమాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు గత 20 సంవత్సరాలుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు శ్రీ ఆర్ కృష్ణయ్య గారితో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 10 వేలకు పైగా ఉద్యమాలు ఢిల్లీ స్థాయిలో అనేక ఉద్యమాలకు పూర్తి సమయం నాయకత్వం వహించిన కర్రి వేణుమాధవ్ ప్రస్తుతం సామాజిక న్యాయం అనే అంశంపై రాష్ట్రంలో అధికార పార్టీ చేస్తున్న బస్సు యాత్రపై మిగతా పార్టీలో జరుగుతున్న బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికార వాటా ఎంత ఇవ్వాలనే అంశం తెరపైకి రావడంతో నియోజకవర్గంలో అనేక రకాలుగా కష్టాలకు ఆర్థికంగా నష్టపోయి ఆర్థికంగా నేటికీ పట్టు విడవకుండా పోరాడుతు ఎమ్మెల్యే సీట్ల కోసం ఎదురుచూస్తున్న బడుగు బలహీన వర్గాలు ఎమ్మెల్యే సీటు కోసం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఆయన సూచన చేశారు ప్రస్తుతం బడుగుల కోసం ఆలోచించే పరిస్థితి రాజకీయ పార్టీలకు వచ్చిందని దానికి కారణం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు వేసిన బాట బడుగు బలహీన వర్గాలకు పూలబాటగా మారే అవకాశం ఉన్నదని వేల కోట్లు సంపాదించే వాళ్ళకే సీట్లు అనే రోజులు పోయి ప్రజా సంక్షేమం వైపు ప్రజా అవసరాల వైపు ప్రజలతో మమేకమై ఉన్న వారి వైపు చూసే పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉందని రాజకీయ పార్టీల్లో వారసులకు తప్పితే కొత్తవారికి అవకాశం ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిపోయే ప్రమాదం కనబడుతున్నదని దీన్ని ఎదుర్కోవాలంటే ఉద్యమ నాయకులకి ఎక్కువ సీట్లు ఇచ్చిన పార్టీకే భవిష్యత్తులో మద్దతు ఇస్తాం అనే వైఖరి నియోజకవర్గాల్లో స్పష్టం చేయాల్సిన అవసరం ఆసన్నమైందని కర్రి వేణుమాధవ్ పేర్కొన్నారు దీనికై త్వరలో 26 జిల్లాలు రథయాత్ర బహిరంగ సభలు చేపడుతున్నట్టుగా ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని రూట్ మ్యాప్ వివరాలు నవంబర్ 10న తెలియజేస్తామని దీనికి అన్ని పార్టీల్లో ఉన్నటువంటి బీసీ నాయకులు మేధావులు విద్యావేత్తలు కార్మిక సంఘాలు మహిళా సంఘాలు మద్దతు ఇచ్చి మన వాదం వినిపిద్దాం మనం రాజ్యాధికారంలో వద్దాం అనే విధంగా ముందుకు వెళదామని తెలియజేశారు




గుళ్ళకమ్మ రచయితల సంఘం ఆధ్వర్యంలో

దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి రచించిన

**'గంగజాతర'**

(నవలిక)

**ఆవిష్కరణ సభ**

తేది: 4-11-2023 శనివారం ఉదయం : గం. 10:00 లకు

స్థలం : ప్రెస్ క్లబ్, ఒంగోలు

**సభా కార్యక్రమం**

సభా ఆహ్వానం : **చప్పిడి కోటేశ్వరరావు,** బహుజనకెరటాలు

సభాధ్యక్షులు : **శ్రీరామకవచం సాగర్,** ప్రముఖ కవి, రచయిత

ముఖ్య అతిథులు : **ఆచార్య కె.వి.ఎన్.రాజు,** ఓ.ఎస్.డి., ఆంధ్రకేశరి విశ్వవిద్యాలయం
**నీలం నాగేంద్రరావు** దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు
**తేళ్ళ అరుణ,** ప్రముఖ రచయిత్రి

వక్తలు : **డా॥ బద్దెపూడి జయరావు,** ప్రఖ్యాత కవి
**చావలి సుధాకర్,** ఒ.పి.డి.యర్.
**బొంత ఏసుదాసు,** ఎం.ఐ.ఎఫ్. రాష్ట్ర నాయకులు
**పాలడుగు రమేష్,** జై భీమ్ పాంథర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు
**అంగలకుర్తి ప్రసాద్,** కళల దండోరా
**డా॥ మొగిలి ప్రసాద్,** ప్రఖ్యాత కవి
**తొరటి ఆనంద్ మాదిగ,** ఎం.ఎస్.ఎఫ్. జిల్లా అధ్యక్షులు
**కొమ్ము సుజన్ మాదిగ,** ఎం.ఎస్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు
**పంచిటి వీరాస్వామి,** ప్రముఖ కవి

నిర్వహణ : గుళ్ళకమ్మ రచయితల సంఘం - ఆంధ్రప్రదేశ్


# కేసీఆర్ సభను విజయవంతం చేయాలి- మంత్రి సత్యవతి



ఖమ్మం, అక్టోబర్ 31:(నేటినిజం ప్రతినిధి): నవంబర్ 1న ఇల్లందులో జరుగు కేసీఆర్ సభను జయప్రదం చేయాలని మంత్రి సత్యవతి రాథోడ్ కోరారు. ఈరోజు సభా ఏర్పాట్లను ఎంపీలు కవిత, రవిచంద్రలతో కలిసి పరిశీలించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభకు నియోజకవర్గం నుండి 70వేల మందిని సమీకరిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే హరిప్రియ విజయానికి ఈసభ దోహద పడుతుందన్నారు. స్టేజి మీద మంత్రి సత్యవతి రాథోడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం...యశస్విని ఝాన్సీ రెడ్డి



మహబూబాబాద్, అక్టోబర్ 30:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని మోత్య తండా గ్రామపంచాయతీ చెందిన 25 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకీ చేరారు. వీరిని పాలకుర్తి నియోజకవర్గం ఇన్చార్జి మరియు ఎమ్మెల్యే అభ్యర్థి హనుమాండ్ల యశస్విని ఝాన్సీరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు .ఈ సందర్భంగా యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ రానున్న 30 రోజులు ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలనీ కోరారు. గ్రామాలలోని ప్రతీ ఓటరు దగ్గరకి వెళ్లి ఆరు గ్యారెంటీ పతకాల గురించి వివరించాలి అని అన్నారు పాలకుర్తి నియోజకవర్గ ప్రజల మద్దతు పూర్తిగా కాంగ్రెస్ పార్టీకే ఉందని అన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రంగు మురళి గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి ముత్యాల పూర్ణచందర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనపురం శ్రీనివాస్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు సీతారాం నాయక్, పట్టణ యువత అధ్యక్షులు ఆనపురం వినోద్, వేణు, పాండు, సత్తిరెడ్డి, బాలాజీ, సతీష్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



ఖమ్మం, అక్టోబర్ 31:(నేటినిజం ప్రతినిధి): నవంబర్ ఒకటవ తారీఖున ఖమ్మం నగరంలోని ట్యాంక్ బండ్ రోడ్డులో ఉన్న ఒయాసిస్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం జరగనున్నది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు, మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భట్టి విక్రమార్క, పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరవుతారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చింది కాబట్టి కృతజ్ఞతగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారం లోకి తీసుకురావడం కోసం ఈ సభను నిర్వహించడం జరుగుతుంది. కావున ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులందరూ హాజరై విజయవంతం చేయవలసిందిగా నిర్వాహకులు కోరుతున్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కె.వి కృష్ణారావు, డాక్టర్ గోపగాని శంకర్రావు, గుంతేటి వీరభద్రం, అర్వపల్లి విద్యాసాగర్, భూక్యా రాంబాబు నాయక్, దొడ్డా శ్రీనివాసరెడ్డి, షేక్ మస్తాన్, తురాబ్, మేకల రామారావు, బచ్చల పద్మాచారి, దాసరి శ్రీనివాస్, కామా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేశాం.. ఆదరించండి.. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్, అక్టోబర్ 31: అభివృద్ధి చేశాం.. ఆదరించండని రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. నిర్మల్ నియోజకవర్గం బీఆర్ఎస్ లో వలసల జోరు కొనసాగుతోంది. సీఎం కేసీఆర్ సారధ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరుతున్నారు. ఈ క్రమంలో సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన యువసేన యూత్, రెబల్ స్టార్ యూత్, గరుడ యూత్, హల్ చల్ యూత్, శ్రీరామ్ యూత్, రెబల్ యూత్ తో పాటు కాంగ్రెస్, బీజేపీకి చెందిన మహిళలు 100మంది బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ గౌడ్ ఆద్వర్యంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. మామాడ మండలం పులిమగుడుగు గ్రామం, నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు గులాబీ జెండాకు జై కొట్టారు. వీరందరికీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ?. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండగా నిర్మల్ లో పని చేస్తున్నామని, అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల్లో ఎలాంటి కుట్రలు చేస్తున్నాయో ప్రజలు గమనించాలని సూచించారు.

# సిద్దిపేట అభివృద్ధి అడ్డుకున్న వాళ్లకు.. ఓటు అడిగే హక్కు లేదు : మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, అక్టోబర్ 31: 'చేసింది చెపుదాం.. సిద్దిపేట ప్రజల గౌరవాన్ని నిలబెడుదాం. ప్రజలు కోరే అభివృద్ధి చేసుకున్నాం. ప్రేమతో ప్రజలను ఓటు అడిగి మేనిఫెస్టోను' వివరించాలని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గం స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మంత్రి మాట్లాడారు. అభివృద్ధి అంటే సిద్దిపేట నేనా అన్న ప్రతిపక్షాలు ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతాయని ప్రశ్నించారు. అభివృద్ధిని ఓర్వ లేని మీకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు.

సిద్దిపేటలో మనకు ఏపార్టీ తో పోటీ లేదు. మనకు మనకే పోటీ అని స్పష్టం చేశారు. మండలం మండలం పోటీ పడండి. ఎక్కువ శాతం తెచ్చుకున్న మండలానికి బహుమతి ఇస్తానని తెలిపారు. సిద్దిపేట అభివృద్ధిని చూసి నేర్చుకునేలా చేసినం. సిద్దిపేట కార్యకర్తలకు ఎమ్మెల్యే, కార్యకర్త అనుబంధం కాదు. కుటుంబ అనుబంధం మనదని పేర్కొన్నారు. ప్రభాకరన్నకు అండగా ఉందాం. దుబ్బాక గెలుపు బాధ్యత మనపై ఉందని చెప్పారు. ఎవరికి ఆపద వచ్చినా కలిసి ఉన్నాం.

కష్టపడి అభివృద్ధి చేసుకున్నాం. సిద్దిపేట అభివృద్ధి అడ్డుకున్న వాళ్లకు ఇక్కడ ఓటు అడిగే హక్కు లేదన్నారు. కేసీఆర్ పాలనలో సంక్షేమ ఫలాలు అందని ఇల్లే లేదు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. కర్ణాటకలో 5 గంటలు కరెంట్ ఇస్తున్నామని డీకే శివ కుమార్ చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇక్కడా 5 గంటల కరెంట్ ఇస్తారని హెచ్చరించారు. మీరు నేను వేరు కాదు. మీ గౌరవం పెరిగితే, నా గౌరవం పెరిగినట్టే. సిద్దిపేట అంటే ఎంతో పేరు ఉంది. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు.

# కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలు మానుకోవాలి : మంత్రి కొప్పుల ఈశ్వర్




కరీంనగర్, అక్టోబర్ 31 :కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలు మానుకోవాలి. ఆ పార్టీ తీరు మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో ప్రజలే తగినరీతిలో బుద్ధి చెబుతారాని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి పై జరిగిన హత్యాయత్నాన్ని మంత్రి ఖండించారు. మంగళవారం ధర్మారం మండలం ఎర్రగుంటపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదన్నారు. ఎన్నికల్లో గెలువలేమనే భయంతో కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దురాఘాతాలకు పాల్పడుతుందని విమర్శించారు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టమని చట్టబద్ధంగా శిక్షిస్తామన్నారు. కాగా, ప్రభాకర్ రెడ్డి పై హత్యాయత్నాన్ని నిరసిస్తూ సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో బంద్ ప్రశాంతంగా కొనసాగుతున్నది.

వ్యాపార సంస్థలు, దుకాణాలు, పాఠశాలలు, మార్కెట్లు స్వచ్ఛందంగా మూసివేశారు. దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు గ్రామ గ్రామాన నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితులు, రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. ప్రభాకర్ రెడ్డి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

